Crime Mirror
QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption

హైదరాబాద్
27-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 45

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మౌనలోకాలకు మన్మోహన్..

## భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని ఇకలేరు

## ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస



- ఐదు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో దేశానికి సేవలు
- పీవీ నాయకత్వంలో భారత గతిని మార్చిన ఆర్థికవేత్త
- సరళీకృత విధానాలతో సంక్షోభాలను తప్పించిన ధీశాలి
- ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సాకారం
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖుల సంతాపం
- వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కేంద్రం

భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్యంతో బాధపడుతున్నా, వీల్‌చైర్‌కే పరిమితమైనా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. పీవీ నాయకత్వంలో నడిచి, ఆర్థిక సంస్కరణలకు బాటలు పరిచిన దార్శనికుడు మన్మోహన్. సరళీకృత ఆర్థిక విధానాలతో.. మౌనంగానే దేశగతిని మార్చారు. ఆరు దశాబ్దాలపాటు రాజకీయాల్లో అజాతశత్రువుగానే ఆయన కొనసాగారు. మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు.



న్యూఢిల్లీ, డిసెంబర్ 26: భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్(92) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. దాదాపు గంటన్నర పాటు ఆయనకు చికిత్స అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని,

మిగతా 2లో




# మనమంతా కలసి పనిచేద్దాం..

## తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి

- మీపై సామాజిక బాధ్యత ఉందని గుర్తించండి
- డ్రగ్స్ తదితర సామాజిక దుర్మార్గాలపై పోరాడండి
- చిత్రపరిశ్రమ అభివృద్ధికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- సినీ ప్రముఖులతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ప్రభుత్వంతో కలసి పనిచేస్తామన్న ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు

కలసి పనిచేద్దాం రండి..తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి అని సిఎం రేవంత్ రెడ్డి చిత్రపరిశ్రమను ఆహ్వానించారు. సినీ పరిశ్రమలో సమస్యలు, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కలసి పనిచేద్దాం రండి..తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి అని సిఎం రేవంత్ రెడ్డి చిత్రపరిశ్రమను ఆహ్వానించారు. సినీ పరిశ్రమలో సమస్యలు, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆయన సూచనలు చేశారు. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మిగతా 2లో

# ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

- పరోక్షంగా బిజెపి, ఆర్ఎస్‌లపై సోనియా ధ్వజం
- రాజ్యాంగ సంస్థలను గుప్పట్లో పెట్టుకున్నారన్న ఖర్గే
- బెళగావిలో సిడబ్ల్యూసి సమావేశాలు ప్రారంభం




2లో

# దేశం గొప్ప భూమిపుత్రున్ని కోల్పోయింది: సీఎం రేవంత్



2లో

# గ్రూప్1 మెయిన్స్ ఫలితాలకు లైన్‌క్లియర్

- పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- పిటిషన్లు ఆలస్యంగా వేయడాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చాక జీవోను సవాలు చేయడం సరికాదని వ్యాఖ్య....మొత్తం ఏడు పిటిషన్లు కొట్టివేత
- తీర్పు వెలువరించిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం

# నీటి పంపిణీ బాధ్యత కృష్ణా బోర్డుదే

- కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టీకరణ
- ఏటా రెండు రాష్ట్రాల సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోవాలని దిశానిర్దేశం

అమరావతి: కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2 అవార్డు అమల్లోకి వచ్చేవరకు

2లో


# కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తమ పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజం



హైదరాబాద్: రేవంత్ పాలనలో ఇందిరమ్మ రాజ్యం పేరిట ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించి.. ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని

# మౌనలోకాలకు మన్మోహన్..



(మొదటి పేజీ తరువాయి)

9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ప్రకటించింది. మన్మోహన్ సింగ్ మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి ఒడ్డుకు తెచ్చిన ఘనత మన్మోహన్‌దే. సరళతర ఆర్థిక విధానాల రూపకర్తగా, దేశ ఆర్థికవ్యవస్థకు కొత్తదిశను చూపిన మార్గదర్శిగా ఆయన నిలిచారు. 1932 సెప్టెంబర్ 26న ప్రస్తుత పాకిస్థాన్‌లోని గాహ్ ప్రాంతంలో జన్మించారు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు మన్మోహన్ సింగ్ కుటుంబం భారత్‌కు వచ్చి మొదట హల్ద్వానీలో, ఆ తర్వాత అమృత్‌సర్‌లో స్థిరపడింది. మన్మోహన్ చిన్న వయసులోనే ఆయన తల్లి మృతి చెందడంతో నానమ్మ దగ్గర పెరిగారు. పంజాబ్ వర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో 1952లో డిగ్రీ, 1954లో పీజీ పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. 1962లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందుకున్నారు. తర్వాత భారత్‌కు తిరిగొచ్చి తను చదివిన పంజాబ్ యూనివర్సిటీలోనే ఎకనమిక్స్ సీనియర్ లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పని చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లోనూ ఆయన కొంతకాలం ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖకు సలహాదారుగా వ్యవహరించారు. 1972 నుంచి 1976 వరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పని చేశారు. 1982 నుంచి 1985 వరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1985 నుంచి 1987 వరకు ప్రణాళిక సంఘానికి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించారు. దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్తగా ఆయన ఎదిగారు.

**రాజకీయాల్లోకి తీసుకొచ్చిన పీవీ**

విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ తనదైన ముద్ర వేశారు. ఆర్థిక రంగంలో ఆయన అనుభవం, జ్ఞానంతో ఎన్నో గొప్ప అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. 1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు.. మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థికమంత్రిని చేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గాడిన పెట్టే కీలక బాధ్యతను అప్పగించారు. ఈ సమయంలోనే దేశంలో ఆర్థిక సంస్కరణలకు, సరళతర విధానాలకు మన్మోహన్ సింగ్ శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.

**ప్రధానిగా అనూహ్య అవకాశం**

1991లో మొదటిసారి అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ 2019 వరకు కొనసాగారు. 2019లో రాజస్థాన్‌కు మారి మరోసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1998 నుంచి 2004 వరకు వాజ్‌పేయీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మన్మోహన్ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవికి అనేక మంది పేర్లు వినిపించినా అనూహ్యంగా ఈ అవకాశం మన్మోహన్ సింగ్‌కు దక్కింది. 2004 మే 22న మొదటిసారి ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఐదేండ్ల తన పాలనకు ప్రజామోదాన్ని పొంది 2009లో మరోసారి ప్రధాని అయ్యారు. పదేండ్ల పాటు ప్రధానిగా కొనసాగి, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, నరేంద్ర మోదీ తర్వాత ఎక్కువ కాలం దేశానికి ప్రధానిగా పని చేసిన నాలుగో వ్యక్తిగా రికార్డు సృష్టించారు.

**మన్మోహన్ సేవలు చిరస్మరణీయం: రాష్ట్రపతి**

'విద్య, పరిపాలనను సులభంగా నడిపించిన అరుదైన రాజకీయ నేతల్లో మాజీ ప్రధాని మన్మోహన్ ఒకరు. భారత ఆర్థిక వ్యవస్థ సంస్కరణలో ఆయన సేవలు కీలకమైనవి. దేశానికి ఆయన చేసిన సేవలు, నిష్కళంకమైన రాజకీయ జీవితం, ఆయన వినయం చిరస్మరణీయం. ఆయన మరణం మనందరికీ తీరని లోటు' అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

**ఆర్థిక వ్యవస్థపై బలమైన ముద్ర: ప్రధానమంత్రి**

'విశిష్టమైన నాయకుల్లో ఒకరిని కోల్పోవడంతో భారత్ దుఃఖంలో మునిగిపోయింది. వినమ్రమైన మూలాల నుంచి ఆయన గౌరవనీయమైన ఆర్థికవేత్తగా ఎదిగారు. ప్రధానిగా, ఆర్థిక మంత్రి సహా అనేక ప్రభుత్వ హోదాల్లో పనిచేసి దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన బలమైన ముద్ర వేశారు' అని ప్రధాని మోదీ అన్నారు.

**మౌనంగానే దేశంపై తనదైన ముద్ర**

ప్రధానిగా పని చేసినప్పుడు ఆయనను మౌనమునిగా ప్రతిపక్షాలు విమర్శించేవి. అయితే, ఆయన మౌనంగా ఉంటూనే దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ప్రధానిగా మొదటి పర్యాయంలో ఆయన దేశ చరిత్రలోనే కీలకమైన ఎన్నో నిర్ణయాలను తీసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. 2008లో వామపక్షాలు వ్యతిరేకించినా, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నా అమెరికాతో పౌర అణు ఒప్పందాన్ని చేసుకున్నారు. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

## దేశం గొప్ప భూమిపుత్రున్ని కోల్పోయింది: సీఎం రేవంత్

హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం రాత్రి 'ఎక్స్'వేదికగా ఆయన ట్వీట్ చేశారు. 'దేశంలోనే గొప్ప ఆర్థిక వేత్త, నాయకుడు, సంస్కరణవాది, అన్నిటికంటే మించి మానవతావాది మన్మోహన్ సింగ్ ఇకలేరు. ధర్మానికి ప్రతీకగా, నిష్కలంకమైన సమగ్రత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన మన్మోహన్ నవభారత నిర్మాతల్లో ఒకరు. తన రాజకీయ, ప్రజా జీవితంలో ఔన్నత్యాన్ని ప్రదర్శించిన భూమి పుత్రుడిని దేశం కోల్పోయింది. మన్మోహన్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'అని ట్వీట్‌లో రేవంత్ పేర్కొన్నారు.

**దేశానికి తీరని లోటు: డిప్యూటీ సీఎం భట్టి**

మన్మోహన్ సింగ్ మరణం పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం తెలిపారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నా రు. దేశానికి మన్మోహన్ చేసిన కృషి, అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు.

**ఉద్యమాన్ని అర్థం చేసుకున్నారు: కేసీఆర్**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. 'పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డ. భారత ప్రధానిగా మన్మోహన్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మన్మోహన్ సింగ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి'అని కేసీఆర్ పేర్కొన్నారు.

**మన్మోహన్ పాత్రను దేశం మర్చిపోదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

మన్మోహన్ సింగ్ మృతి పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. 'ఆర్బీఐ గవర్నర్ గా, ప్రణాళికా సంఘంలో కీలక బాధ్యతల్లో, యూ జీసీ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖమంత్రిగా మన్మోహన్ దేశానికి వన్నెతీసుకొచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు, దేశ ఆర్థిక మంత్రిగా దేశంలో సంస్కరణలు తీసుకురావడంలో మన్మోహన్ పోషించిన పా త్రను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. ఆయన మరణం దేశానికి తీరని లోటు'అని పేర్కొన్నారు.

**ఆధునిక భారత నిశ్శబ్ద నిర్మాత : కేటీఆర్**

'ఆధునిక భారత నిశ్శబ్ద నిర్మాత, దూర దృష్టి గల నేత, మేధావి, అద్భుతమైన మానవతావాది మన్మోహన్ సింగ్. చరిత్ర పుటల్లో వారి కీర్తి ఎల్లప్పుడూ అజరామరంగా నిలిచిపోతుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతి' .

## గ్రూప్1 మెయిన్స్ ఫలితాలకు లైన్‌క్లియర్

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి లైన్‌క్లియర్ అయ్యింది. రాష్ట్రంలో కీలక పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం చేపట్టిన పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. రిజర్వేషన్ల అంశం తేలేవరకు మెయిన్స్ పరీక్షల ఫలితాలు ప్రకటించవద్దని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్‌పీఎస్సీ)ను ఆదేశించాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. పిటిషన్ల దాఖలులో ఆలస్యాన్ని ప్రస్తావించిన ధర్మాసనం.. ఫిబ్రవరిలో తాజా నోటిఫికేషన్ ఇస్తే ఇందుకు సంబంధించిన జీవో 29 ప్రతి అప్‌లోడ్ కాలేదన్న కారణంతో ఆలస్యంగా పిటిషన్లు దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది.ప్రిలిమ్స్ ఫలితాలు వెల్లడించిన తర్వాత జీవో ను సవాల్ చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 226 ప్రకారం తమకున్న విస్తృతాధికారాల మేరకు ఉత్తర్వులు వెలువరుస్తామని స్పష్టం చేసింది. రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రూప్%-%1 పోస్టుల భర్తీ కోసం 2022లో ప్రభుత్వం జీవో 55 జారీ చేసింది. రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిది.

## ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

బెంగళూరు: మహాత్మాగాంధీ వారసత్వం ముప్పులో ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈ రోజు అన్నారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న వారు, వారికి మద్దతు ఇచ్చే సంస్థల నుంచి మహాత్మా గాంధీ వారసత్వం ముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. పరోక్షంగా బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌పై సోనియా గాంధీ దాడి చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో గాంధీ సిద్ధాంతాలు, సంస్థలు దాడులకు గురవుతున్నాయని అన్నారు. ఈ శక్తుల్ని ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని పునరుద్ధరించడం తమ పార్టీ పవిత్ర కర్తవ్యమని ఆమె చెప్పారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు కర్ణాటక బెలగావిలో జరుగుతోంది. శతాబ్దం క్రితం ఇదే వేదికగా మహాత్మాగాంధీ కాంగ్రెస్‌కి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల సోనియా గాంధీ హాజరుకాలేదు. ఈ సందర్భంగా లిఖితపూర్వక ప్రకటనలో రాజ్యాంగ విలువలు, గాంధీ ఆశయాలను పరిరక్షించడం పార్టీ కర్తవ్యమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ బెలగావిలో కాంగ్రెస్ అధ్యక్షుడవ్వడం పార్టీకి, స్వాతంత్య్ర ఉద్యమానికి మలుపు అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. స్వాతంత్యం÷-ర కోసం ఎలాంటి పోరాటం చేయని సంస్థలు మహాత్మా గాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని, ఒక విషతుల్యమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాయని, వీటి వల్లే ఆయన హత్య జరిగిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న వారి వల్ల గాంధీ ఘటన ప్రమాదంలో పడిందని అన్నారు.

### మనమంతా కలసి

# పనిచేద్దాం..

మంత్రివర్గ ఉపసంఘం సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై అధ్యయనం చేయనుంది. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అదనపు షోల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, టికెట్ రేట్ల పెంపుపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టనుంది. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించిన నేపథ్యంలో ఇండస్ట్రీ ప్రముఖులు తమ సూచనలను ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు.తెలుగు సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. సినిమా పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో సినీ ప్రముఖులు సిఎం రేవంత్ ను కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని చెప్పారు. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి సర్కార్ అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్‌లో ఇండస్ట్రీ సోషల్ రెస్పాన్సిబిలిటీతో ఉండాలని చెప్పారు. డ్రగ్స్ క్యాంపెయిన్, మహిళా భద్రత క్యాంపెయిన్‌లో చొరవ చూపాలని, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంను ప్రమోట్ చేయాలని సిఎం సూచించారు. ఈ క్రమంలో సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే తమ ముఖ్య ఉద్దేశమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. సినీ ప్రముఖులతో సీఎం భేటీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి సినీ పెద్దలకు సూచించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సీఎంతో సమావేశమయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశం ప్రారంభంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వీడియోను సినీ ప్రముఖుల ఎదుట సీఎం ప్రదర్శించారు.

## కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందున ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై కక్షతో అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.ప్రజల్లో వెల్లువెత్తుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకోలేక నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం నోటీసు ఇవ్వకుండా గురువారం తెల్లవారు జామున పోలీసులు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారని ధ్వజమెత్తారు. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలనే విష సంస్కృతికి చరమగీతం పాడాలన్నారు.

**ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా? : హరీశ్‌రావు**

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన పేరిట డబ్బా కొడుతూ, సీఎం రేవంత్ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడేది లేదని, తెలంగాణ సమాజమే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మేడే రాజీవ్ సాగర్, డాక్టర్ వాసుదేవరెడ్డి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును ఖండించారు.

## నీటి పంపిణీ బాధ్యత కృష్ణా బోర్డుదే

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలకు కృష్ణా నదీ జలాలు పంపిణీ చేసే బాధ్యత కృష్ణా బోర్డుదేనని కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టం చేసింది. నీటి పంపకాల్లో అపెక్స్ కౌన్సిల్ జోక్యం చేసుకోబోదని బోర్డుకు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలకు నీటి పంపిణీపై జనవరి 21న నిర్వహించే 19వ సర్వసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా 811 టీఎంసీలను ఉమ్మడి ఏపీకి కేడబ్ల్యూడీటీ%-%1 కేటాయించింది. విభజన నేపథ్యంలో కృష్ణా నదీ జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తకుండా చూసేందుకు 2014 మే 28న కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటుచేసింది. కేడబ్ల్యూడీటీ%-%1 ప్రాజెక్టుల వారీగా చేసిన నీటి కేటాయింపుల ఆధారంగా 2015%-%16 నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు 512.06, తెలంగాణకు 298.94 టీఎంసీలను పంపిణీ చేస్తూ 2015 జూలై 18%-%19న కేంద్ర జల్ శక్తి తాత్కాలిక సర్దుబాటు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో 2016 సెప్టెంబర్ 21న అపెక్స్ కౌన్సిల్ తొలి సమావేశంలో 2016%-%17 సంవత్సరంలోనూ తాత్కాలిక సర్దుబాటు ప్రకారమే నీటిని పంపిణీ చేసుకోవడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.

**అపెక్స్ కౌన్సిల్ అజెండాలో చేర్చాలని..**

రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపకాల అంశాన్ని అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి.. తుది నిర్ణయం తీసుకునేలా అజెండాలో చేర్చాలని కేంద్ర జల్ శక్తి శాఖకు కృష్ణా బోర్డు విజ్ఞప్తి చేసింది. కృష్ణా బోర్డు పనితీరుపై 2024 జనవరి 9న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో కృష్ణా జలాల పంపకం అంశాన్ని కృష్ణా బోర్డు అధికారులు లేవనెత్తారు. కృష్ణా జలాల పంపకం జోలికి అపెక్స్ కౌన్సిల్ వెళ్లబోదని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి తేల్చిచెప్పారు.



# సినిమా వాళ్ళు బెదరించే ప్రయత్నం

## సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్,డిసెంబర్26(ఆర్ఎన్ఎ): సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు. రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం భారాస నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

# కండిషన్ బెయిల్‌పై ఉంటూ ప్రెస్‌మీట్లా

## పట్నం బెయిల్ రద్దును కోరుతాం

### ఐజీ సత్యనారాయణ అభ్యంతరం

వికారాబాద్,(క్రైమ్ మిర్రర్): కండిషనల్ బెయిల్‌పై ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, భారాస నేత పట్నం నరేందర్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టడంపై ఐజీ సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి సీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐజీ సత్యనారాయణ మాట్లాడారు. విచారణను ప్రభావితం చేసే విధంగా నరేందర్ రెడ్డి మీడియా సమావేశం పెట్టడం సరైంది కాదన్నారు. అ విషయంలో బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరతామని ఐజీ చెప్పారు. 'లగచర్లలో 230 మంది పోలీసులతో బందోబస్తుగా ఏర్పాటు చేశాం. సురేష్ పథకం ప్రకారమే కలెక్టర్‌ను గ్రామంలోకి తీసుకెళ్లాడు. పోలీస్ నిఘా వైఫల్యం అనడం సరికాదు. ఫార్మా భూసేకరణ విషయంలో నరేందర్ రెడ్డిని అరెస్టు చేయలేదు. కలెక్టర్‌పై దాడి కేసులోనే అరెస్టు చేశాం. ఈ కేసులో ఎవరినీ కొట్టలేదు. అనుమానితులను మూడు విడతల్లో అదుపులోకి తీసుకున్నాం.. ఘటనతో సంబంధం లేని వారిని వదిలేశాం. ప్రెస్‌మీట్‌లో అవాస్తవాలు చెప్పడం మానేయాలి. ఏ ప్రభుత్వం కూడా రైతులకు బేడీలు వేయమని చెప్పదు. సురేష్ వాయిస్ రికార్డు మా దగ్గర ఉంది. అతనే మొత్తం ఎ÷-లాన్ చేసింది. సమయం వచ్చినప్పుడు బయటపెడతాం. పట్నం నరేందర్ రెడ్డి ఫోన్ పాస్‌వర్డ్ చెప్పడం లేదు. నరేందర్ రెడ్డి, సురేష్.. విచారణకు సహకరించడం లేదు' అని ఐజీ తెలిపారు.

## అల్పపీడనం ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని సికింద్రాబాద్, తిరుమలగిరి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బోరబండ, కూకట్‌పల్లి, బాచుపల్లి, తార్నాక, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షానికి జనం తడిసి ముద్దయ్యారు. వర్షానికి తోడు చలి తీవ్రత కూడా పెరగడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

## గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాక్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై హైకోర్టును గ్రూప్-1 అభ్యర్థులు ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలు పూర్తి అయ్యాయి. దీంతో రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలను ఆపాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

# ఎర్రోళ్లను వెంటనే విడుదల చేయాలి

## ఇంట్లోకి చొరబడి ఎందుకు అరెస్ట్ చేశారు

### బిఆర్ఎస్ నేతలు పల్లె, కేతిరెడ్డిల విమర్శ

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): విద్యార్థి ఉద్యమ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టను బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ప్రజల కోసం పనిచేసే వారి ఇళ్లల్లోకి పోలీసులే దొంగల్లా చొరబడి అరెస్టులు చేయడమా? అని ఆయన ప్రశ్నించారు. సమయం, సందర్భం లేకుండా.. ఎప్పుడంటే ఎప్పుడు అరెస్టులు చేయడం ఏంటని నిలదీశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ విద్యార్థి నాయకుడిగా తెలంగాణ కోసం నిజాయితీ, నిబద్ధతతో కొట్లాడినవాడు. బహుజనుల అభ్యున్నతి కోసం ఆరాటపడే యోధుడు అని రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సబ్బండ వర్గాలకు చేసిన వంచనను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని, అరెస్టు చేసిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రవి కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలనలో అర్ధరాత్రి, అపరాత్రి, తెల్లవారకముందే అరెస్టులు చేయడం ఏందీ? అని ప్రశ్నించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఏమైనా బందిపోటా? ఉగ్రవాదా? గజదొంగనా? అని నిలదీశారు. ప్రశ్నించే గొంతులను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించడం ఈ ప్రభుత్వంలో లేనట్టు కనిపిస్తుంది? నిజంగా నేరం చేసి ఉంటే ముందుగా నోటీసులు ఇవ్వండి? అరెస్టు చేయాలంటే అరెస్ట్ వారెంట్ చూయించండి? ఇవేమి లేకుండా ఉగ్రవాది లెక్క తెల్లవారకముందే ఇంటికి వచ్చి పట్టుకెళ్ళడం ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యక వాదులందరూ ఖండించాల్సిన అరెస్ట్ ఇది కేతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తేలేవని ప్రజల పక్షాన నిలబడితే అరెస్టులు చేయడము ప్రజా పాలనలో కామన్ అయిపోయింది. అరెస్టులతో బెదిరింపులతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరు ఇది ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యంలో అన్యాయం జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, బ్లాక్‌మెయిల్ దందాలు రాష్ట్రంలో శరమాములైపోయాయి. తస్మాత్ జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ఈ సమయములో ప్రజలంతా ఏకధాటిపై ఉండి అన్యాయం ఎదిరించాల్సిందే. న్యాయం కోసం పోరాడాల్సిందే. ఆ పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు, అరెస్టులు, గొంతు నొక్కడాలు ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. అక్రమ అరెస్టులకు భయపడేది లేదు ప్రజల పక్షాన నిలబడతాం.. నిలదీస్తాం.. కొట్లాడుతాం.

# కామారెడ్డి జిల్లాలో కలకలం

## ముగ్గురు పోలీస్ సిబ్బంది అనుమానాస్పద మృతి

### చెరువులో మృతదేహాల గుర్తింపు..ముమ్మర దర్యాప్తు



కామారెడ్డి, (క్రైమ్ మిర్రర్): పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేగింది. ఒకే రోజు ముగ్గురు సిబ్బంది అదృశ్యం కాగా ఇద్దరు చెరువులో విగతజీవులుగా కనిపించారు. ఓ ఎస్సై, లేడీ కానిస్టేబుల్ సహా కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పని చేస్తోన్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యం కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. అటు, జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఎస్సై ఆచూకీ కోసం గాలించగా కొద్దిసేపటి తర్వాత ఎస్సై మృతదేహం లభ్యమైంది. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో పని చేస్తుండగా.. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ గతంలో బీబీపేట ఎస్సైగా పని చేసి బదిలీపై భిక్కనూరు వచ్చారు. ఎస్సై అక్కడ పని చేసిన సమయంలోనే వీరిద్దరికీ పరిచయం ఏర్పడిందని పోలీసులు భావిస్తున్నారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలేంటి.? అసలేం జరిగింది.? అనే దానిపై ఆరా తీస్తున్నారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులు ఆయన కోసం ఆరా తీయడం ప్రారంభించారు. అటు, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న లేడీ కానిస్టేబుల్ శ్రుతి బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు స్టేషన్‌లో చెప్పి బయటకు వచ్చారు. మధ్యాహ్నం అయినా కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బీబీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరు గాంధారి మండలం గుర్జాల్‌లో ఉంటున్నారు. అయితే, శ్రుతి స్టేషన్ నుంచి ఎప్పుడో వెళ్లిపోయినట్లు పోలీసులు తెలపడంతో పేరెంట్స్ అధికారులను సంప్రదించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆధ్వర్యంలోని బృందాలు వెంటనే అక్కడికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెరువు వద్ద కానిస్టేబుల్ శ్రుతి సెల్‌తో పాటు బీబీపేటకు చెందిన నిఖిల్ సెల్ కూడా దొరికింది. అలాగే, భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌కు చెందిన చెప్పులు, నిఖిల్ చెప్పులు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించగా లేడీ కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రుతి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్సై ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుండడంతో ఆయన ఆచూకీ లభించలేదు. ఏం జరిగి ఉంటుందన్నది అంతుచిక్కడం లేదు. ముగ్గురూ కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్సై సాయికుమార్ మృతదేహం సైతం లభ్యం కావడంతో ఏం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.



# శాంతిభద్రతల్లో రాజీపడే ప్రసక్తే లేదు

## అభిమానులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే

### బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చేదే లేదు : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అభిమానులను నియంత్రించాల్సిన బాధ్యత సెలబ్రిటీలదేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపై బౌన్సర్లపై విషయంలో సీరియస్‌గా ఉంటామన్నారు. టికెట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీలో చేసిన ప్రకటనకే కట్టుబడి ఉంటామన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సినీ ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమ అభివృద్ధికి, ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని చెప్పారు. మహిళల భద్రత, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చొరవ చూపాలన్నారు. టెంపుల్, ఎకో టూరిజం ప్రమోట్ చేయాలని సూచించారు. పెట్టుబడుల విషయంలోనూ సినీ పరిశ్రమ సహకరించాలన్నారు. అన్ని అనుమతులుఉంటేనే సినీ ఇవెంట్లు నిర్వహించుకోవాలని తెలిపారు. తెలంగాణ రైజింగ్‌లో ఇండస్ట్రీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీతో ఉండాలన్నారు. ఒక మహిళ ప్రాణం పోవడంతోనే సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నదని చెప్పారు. ఎవరిపై ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టలేదన్నారు.

## విషమంగా మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారు. దీంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు.

## అటకెక్కిన ఆరు గ్యారంటీలు : కేటీఆర్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఆరు గ్యారంటీలు ప్రకటించి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను కూడా అటకెక్కించారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

## కేసులతో భయపెట్టలేరని విమర్శలు


### ఇచ్చిన హామీలపై శ్రద్ధ పెట్టాలన్న వేముల




నిజామాబాద్, (క్రైమ్ మిర్రర్): ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయే తప్ప ఏ రంగం పైనా శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు సినీ హీరో అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా రాక, రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నందుకే రేవంత్ సర్కారు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నదని వేముల మండిపడ్డారు. కేసులతో తమ గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని గురువారం విమర్శించారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదని, ప్రజా సమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని ÷ూజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి.. క్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం రాజకీయ అమాయకత్వం తప్ప

# అందమైన అబద్ధాలతో ఎంతకాలమీ పాలన !

**వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోందని బిజెపి శ్రేణులు పదేపదే ప్రచారం చేస్తున్నారు. గత పదేళ్లలో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడంలో బిజెపి నేతలుజవిఫలంఅ వుతూనే ఉన్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో వారికి పట్టింపు లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్నారు.**



నిజానికి వికసిత భారత్ లక్ష్యం అయివుంటే ద్రవ్యోల్బణం ఎందుకు దాడి చేస్తోంది. ధరలు ఎందుకు పెరుగుతున్నాయి. నిరుద్యోగం ఎందుకు తాండవిస్తోంది. వీటన్నిటికి పరిష్కారం చూపడంలో మోడీ విఫలం అయ్యారనే చెప్పాలి. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపలేక పోతున్నాం. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపోదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ద అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పాలన జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న మోడీ.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ది అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం కూడా బలంగా ఉంది. పేదల అభివృద్దే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి. సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతక గలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్న మాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నా మంటున్నారు. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నా మని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజల ను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటికల

ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్ల నెలకు లక్షా 60 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. అందమైన ఏసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి.

ఎడిటోరియల్



# గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి

## విఆర్‌వో, విఎవోలతో మళ్లీ గాడిన పడేసే యత్నం


**పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రికార్డులకు భద్రత లేకుండా పోయింది. భూముల లెక్కాపత్రం లేదు. జమాబందీ వల్ల భూములు, ప్రభుత్వ ఆస్తులకు లెక్క గట్టేవారు. సరిహద్దులు పక్కాగా ఉండేవి. కానీ అవన్నీ దెబ్బతిన్నా, వాటిని రక్షించే ప్రయత్నం చేయడం లేదు. కెసిఆర్ హయాంలో విఆర్‌వో వ్యవస్థ రద్దుతో ఉన్నది కూడా మాయం చేశారు. దీంతో తెలంగాణలో భూదోపిడీ కేసులు పెరిగాయి. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూములు మాయమయ్యాయి.**

దీనికి సమాధానం చెప్పకుండా ధరణి పేరుతో మరింతగా దోపిడీ చేశారు. ఈ క్రమంలో మళ్లీ గ్రామీణ రెవెన్యూ వ్యవస్థకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ధరణిని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్ఏ, వీఆర్వో లాంటి కీలక వ్యవస్థను రద్దు చేసింది. వాటి స్థానంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. ఆ సమయంలో వీఆర్వోలు, వీఆర్ఏ లను ఇతర

శాఖలకే కేటాయించారు. ఆ సమాచారాన్ని సేకరించి అర్హత ఉన్న ఉద్యోగులను తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబర్ 28 నెలలోగా అందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పెట్టాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో మొత్తం 10,911 వరకు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయం

తీసుకుంది. గతంలో ఉన్న వీఆర్ఏ, వీఆర్వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేశారు. వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలైంది. వారికి తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. లేకపోతే రెవెన్యూ శాఖలో కాంగ్రెస్ ప్రభుత్వం వేరే ఏదైనా కొత్త పేరుతో వారికి తిరిగి రెవెన్యూ అధికారులుగా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ అర్హత ఉన్న మాజీ వీఆర్ఏ, వీఆర్వోలను రెవెన్యూ శాఖలో గతంలో నిర్వహించిన విధులు అప్పగించనున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్వో వ్యవస్థను పునరుద్ధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో పాత ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 28 వరకు వీఆర్వోలు, వీఆర్ఏల పునరుద్ధరణకు గడువు విధిస్తూ తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి అదే పోస్టుల్లోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. జూనియర్ రెవెన్యూ అధికారి పేరుతో ప్రతి గ్రామంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా భూమి సమస్యల పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు. ధరణి కారణంగా వేలాది మంది భూములు కోల్పోయారని, అందులో జరిగిన తప్పిదాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు.

(ఆధ్యాత్మిక చింతన)



# శబరిమలకు పోటెత్తుతున్న భక్తులు

## మకరజ్యోతి నాటికి పెరగనున్న సంఖ్య

శబరిమలలో అయ్యప్ప భక్తులు హరిహర సుతుడు అయ్యప్ప దర్శనం కోసం పోటెత్తుతున్నారు. రోజులో వేలాది మంది స్వాములు అయ్యప్పను దర్శనం కోసం బారులు తీరుతున్నారు. మకరజ్యోతికి ముందే దర్శనాలకు భక్తులు పోటెత్తారు. దీంతో పంబాతీరం భక్తజనసంద్రంగా మారింది. శబరిమలకు రికార్డు స్థాయిలో అయ్యప్ప భక్తులు పోటెత్తుతున్నారు. శరణుఘోషతో శబరిమల ప్రతిధ్వనిస్తోంది. కిలో మీటర్ల మేర క్యూ లైన్లు కిక్కిరిసిపోతున్నాయి. అయ్యప్ప దర్శనం కోసం 12 గంటలకు పైగా సమయం పడుతోంది. సన్నిధానాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య రోజుకు లక్ష వరకు ఉంటోందని అంచనా. అయ్యప్ప నెల దర్శనం, నక్షత్ర దర్శనాల కోసం భక్తులు ముందుస్తుగా రిజర్వేషన్ చేసుకుని తరలివచ్చారు. ఇక ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం30,78,050 మంది భక్తులు శబరిమలను సందర్శించారు. గతేడాది కంటే ఈసారి 4, 45,000 మంది భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రద్దీ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇకనుంచి రోజురోజుకూరద్దీ మరింత పెరిగే అవకాశం వుంది. ఇప్పటికే కిలోమీటర్ల మేర క్యూ లైన్‌లు కిటకిటలాడుతున్నాయి. రెండు మూడు రోజుల క్రితం వరకు భక్తుల సంఖ్య 80 వేల వరకు ఉండేది. క్రమంగా భక్తుల సంఖ్య లక్షవరకు చేరుకుంటోంది. కానీ ఏర్పాట్లు ఆ స్థాయిలో లేకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రద్దీ వేల సంఖ్యలో ఉంటే క్రమబద్ధీకరించడానికి పోలీసుల సంఖ్య వందల్లో కూడా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కేరళ ప్రభుత్వం ఆదేశించినా.. పోలీసులకు - దేవస్థానంకు మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# బీజేపీలో చేరిన విశాఖ డెయిరీ పాలక వర్గం

విశాఖ డెయిరీ పాలక వర్గం బీజేపీలో చేరింది. రాజమండ్రిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి సమక్షంలో డెయిరీ ఛైర్మన్ ఆడారీ ఆనంద్‌తో పాటు డైరెక్టర్లు యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి బీజేపీ కండువాలను కప్పుకున్నారు. రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి ఆడారి ఆనంద్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. వారి తండ్రితో మా నాన్నకు అవినాభావ సంబంధం ఉందన్నారు. పార్టీలోకి వచ్చిన తరువాత సిద్ధాంతం, క్రమశిక్షణ అవలంబిస్తూ వారి ప్రాంతంలో పార్టీని బలోపేతం చెయ్యడానికి కృషి చేయాలని సూచించారు. ప్రధాని మోడీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని, అలాగే దృఢ నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట అంటూ పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో కూడా బీజేపీని ప్రజలు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. 11వ ఆర్థిక శక్తి గా ఉన్న దేశాన్ని 5వ ఆర్థిక శక్తిగా ప్రధాని మోడీ తీర్చిదిద్దారన్నారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ట్రైబల్ మహిళను రాష్ట్రపతి చేసిన బీజేపీ.. మహిళలను ఎంతగా గౌరవిస్తుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలకు బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. స్వతహాగా బీజేపీలో ప్రజలు చేరుతున్నారని.. 25 లక్షల మంది ప్రజలు పార్టీలో చేరారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి సహాయ సహకారాలు అందజేస్తున్నారన్నారు. చిటికెడు మట్టి కూడా గత ప్రభుత్వం విదల్చలేదని విమర్శించారు. రాష్ట్రానికి పన్ను రాయితీలు, అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. గడిచిన 5 ఏళ్లలో రాక్షస విధ్వంసకర పాలన చూశామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కచ్చితంగా ఏపీ అభివృద్ధి పదంలో దూసుకుపోతుందన్నారు. సుపరిపాలన అందించడం వల్లే బీజేపీని వరుసగా మూడుసార్లు ప్రజలు గెలిపించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. బీజేపీని మరో రెండు మూడు సార్లు అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ బీజేపీకి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీని సమర్థించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం సభలో ఎంపీ పురంధేశ్వరి మాట్లాడారు. కండువా వేసుకోవడమే కాదు.. బాధ్యతలు కూడా తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ రాష్ట్రంలో బలమైన శక్తిగా రూపుదిద్దుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వాజ్‌పేయ్ జన్మదినోత్సవం రోజున చేరికలు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి నాంది అంటూ ఆమె వ్యాఖ్యానించారు. వాజ్‌పేయ్ జీవిత ప్రస్థానంలో దేశాభివృద్ధికి, పార్టీ ఎదుగుదలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.మహనీయుల ఆశయాలను, సిద్దాంతాలను ఆచరణలో పెట్టిన రోజు వారికి అర్పించే నిజమైన నివాళులు అంటూ పేర్కొన్నారు. రాజకీయ ప్రజా జీవితంలోకి వచ్చే ప్రతి ఒక్కరూ వాజ్‌పేయ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచే విధంగా సర్వ శిక్షా అభియాన్ ద్వారా ఉచిత విద్యను ప్రవేశపెట్టిన మహానీయుడు వాజ్‌పేయ్ అంటూ చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలను బీజేపీ నమోదు చేయగలిగిందని వెల్లడించారు. ప్రతి వర్గంలోనూ బీజేపీ పట్ల సదుద్దేశం ఉందన్నారు. దేశంలో ఉన్న 1500 పార్టీల్లోనూ బీజేపీ భిన్నమైనదని.. అందుకనే టీ అమ్ముకునే వ్యక్తి ప్రధాని కాగలిగారని .. సాధారణ ట్రైబల్ మహిళ రాష్ట్రపతి కాగలిగిందన్నారు.వాజ్‌పేయ్ అడుగుజాడల్లోనే ప్రధాని మోడీ దేశాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టడానికి భారత ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ నిమ్న కులాలకు, అట్టడుగు ప్రజలకు న్యాయం చేయడమే బీజేపీ అంతిమ లక్ష్యమని వెల్లడించారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అందరికంటే ఎక్కువ గౌరవించింది బీజేపీ మాత్రమేనన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చింది బీజేపీనేనని పేర్కొన్నారు. అంబేద్కర్ ఇంటిని సైతం పవిత్ర స్థలంగా మార్చిన పార్టీ బీజేపీనేనని అన్నారు.బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించింది బీజేపీనే అని వెల్లడించారు. కులమతాలకు అతీతంగా బీజేపీ దేశాన్ని అభివృద్ధి చేసిందన్నారు. 33 శాతం మహిళా బిల్లును అమోదించేట్లు చేసిన ఘనత బీజేపీదేనని.. 65 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మహిళలు గుర్తు రాలేదన్నారు. బెజవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా భారత కమ్యూనిస్టు పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ సిపిఐ పార్టీ కార్యాలయం దగ్గర రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు కామ్రేడ్ పుస్తకాల నర్సింగ్ రావు, మైలార్ దేవ్ పల్లి చౌరస్తాలో రాష్ట్ర మున్సిపల్ సంఘం యూనియన్ కార్యదర్శి కొమ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ చౌరస్తాలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ ఎంఏ రియాజ్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశం గడ్డపై ఎర్ర జెండా 1925లో డిసెంబర్ 26న కాన్పూర్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించిందని ఆయన తెలిపారు. ఆనాటి నుంచి ఈ రోజు వరకు పేద ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. భారతదేశం బ్రిటిష్ పరిపాలనలో ఉన్నప్పుడు దేశ స్వతంత్రం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నడిపింది భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. ఆ పోరాటాలను జీర్ణించుకొని బ్రిటిష్ ప్రభుత్వం అనేకమంది కమ్యూనిస్టులను నిర్బంధించి జైల్లో పెట్టిందని కమ్యూనిస్టు పార్టీ నాయకులను జైలు పాలు అయిన వారిలో భగత్ సింగ్, సుకుదేవ్, రాజ్ గురు యువ కమ్యూనిస్టులను ఉరి తీయడం జరిగిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి దున్నేవాడికే భూమి కావాలని వెట్టిచాకిరి విముక్తి కోసం జాగీర్ దారులకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపింది భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన కొని అన్నారు. ఈ పోరాటంలో 4500 మంది చనిపోయారని ఆయన గుర్తు చేశారు. ఈ పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూ పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. భూ పోరాటాలు నడపాలంటే ఎర్రజెండా పార్టీ భూ పంపిణీ జరగాలన్న ఎర్రజెండా పార్టీ పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు పింఛన్లు ప్రతి పేదవాడి సమస్యను తీసుకొనిపాలకవర్గాలపై పోరాటాలు నడిపి పరిష్కారాం అయ్యేవరకు ఉద్యమాలు చేస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఇలాంటి పార్టీలో పనిచేయడం ప్రతి ఒక్క కార్యకర్త గర్వించదగ్గ విషయమని అన్నారు. నల్లగొండ జిల్లాలో ఈ నెల 30 తేదీన పెద్ద బహిరంగ సభ ఉంటుందనీ దానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ సంఘం యూనియన్ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఎంఏ. రియాజ్, సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె. విజయానంద్ గౌడ్, బీసీ సంఘం జిల్లా నాయకులు జె. సదానందం గౌడ్, గండిపేట్ మండల కార్యదర్శి స్వామి, పార్టీ కార్యాలయ కార్యదర్శి సత్యనారాయణ, పాండు, బండి నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుంది







**గండిపేట్(క్రైం మిర్రర్):** దేశంలో అధికారంలోకి ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విదానాలను అవలంభిస్తుందని వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐకమత్యంతో ఉద్యమించాలని రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సిపిఎం పార్టీ గండిపేట్ మండలం-1 మహాసభలు గురువారం మణికండ నెమలినగర్ లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎ. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు గోరికల నర్సింహ్మా, జిల్లా కమిటి సభ్యులు అలిదేవేందర్లతో కలిసి రుద్రకుమార్ హజరైయారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండా దేశంలో కులమత బేధాలు రెచ్చగోడుతుందన్నారు. దేశాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉన్నటువంటి ప్రభుత్వం పేదలు బడుగు బలహీన వర్గాలు కార్మికులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మొత్తాన్ని గాలికి వదిలేసి నేను చెప్పింది వేదం అన్నట్టు విరవేగిన టిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెఇతే ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందన్నారు. సిపిఎం పార్టీ సభ్యులు, కార్యకర్తలంతా కలిసి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికోడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై న్యాయమైన పోరాటాలు చేసి మనకు రావాల్సినటువంటి వాటాను, హక్కులను సాధించుకోవాలన్నారు. నూతన కమిటిని ఎన్నిక...సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా డప్పు ప్రవీణకుమార్, మండల కమిటి సభ్యులుగా ఎం. అశోక్, మైపాల్యాదవ్, యాదగిరి, సుభాష్, భారతమ్మ, నాగేష్ గౌడ్, బి. బాలరాజ్, రాజుగౌడ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి సభ్యులంతా రానున్న రోజుల్లో నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తు ప్రజల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**గండిపేట్(క్రైం మిర్రర్):** హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో బీర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో హెచ్‌పికేఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న కుల బంధువులు సభలో ప్రసంగించారు. ప్రముఖుల సలహాలు, సూచనలు ఇస్తూ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రె కాపరులు అప్పులు చేసి కొన్న గొర్రెలను కొని ఎండనక, వాననక, పగలనక, రాత్రిఅనక అడవిలో గొర్రెలను మేపుకుంటూ వెళుంటారన్నారు. అనుకోకుండా రోడ్డుపైకి వచ్చిన గొర్రెలను మృత్యు రూపంలో వచ్చిన భారీ వాహనాలు గొర్రెలను ఢీకోనడంతో వందలాది గొర్రెలు చనిపోయి గొర్రెల కాపరులు కుటుంబాలు వీధిన పడి ఇతర రాష్ట్రాలకు వలస కూలీలుగా వెళ్లి నానా ఇబ్బందులపాలై జీవిస్తున్నారన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి గొర్రెలకు ఇన్సూరెన్స్, గొర్రె కాపరుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి గొర్రె కాపరులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం వ్యవస్థాపకులు కొల్లంపల్లి శ్రీనివాస్ కురువ, జిల్లా అ్యధ్యక్షులు మాదారం కృష్ణ కురువ, జంట నగరాల అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురువ, ఆనంద్, కోస్గి హనుమంతు కురువ, బాన్యనోల రామచందర్ కురువ, జేట్రం శ్రీనివాస్ కురువ, కాంతల అశోక్ కురువ, అప్ప శ్రీను కురువ, నామల రాము కురువ, మల్లేష్ కురువ, కొల్లురు శివకురువ, మహేందర్ కురువ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.




## దుద్యాలలో నూతన ఠాణా ప్రారంభించిన ఐజి సత్యనారాయణ...!

### ఎస్సైగా భరత్ కుమార్ రెడ్డి నియామకం...!


**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** దుద్యాల మండలంలో నూతన పోలీస్ స్టేషన్ ను ప్రారంభించడానికి మల్టీజోల్-2 ఐజీ సత్యనారాయణ,కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ లింగ్యా నాయకే హాజరై నూతన ఠాణాను ప్రారంభించారు. నూతన పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా భరత్ కుమార్ రెడ్డిని కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం ఇచ్చి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మల్టీజోల్ -2 ఐజి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు అవుతున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ వలన శాంతి యుత వాతావరణం ఉందన్నారు.ఒక వ్యవస్థ బాగుపడుతుందంటే ఒక్క మండలం,జిల్లా,రాష్ట్రం,దేశం బాగుపడుతుందని చెప్పారు. ఏ అన్యాయం అక్రమాలు జరిగిన అత్యవసర అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్ ను డయల్ చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,పలువురు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28న ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గండిపేట్(క్రైం మిర్రర్):** గండిపేట్‌లోని మహాత్మ గాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం(రెమినిసెన్స్%-%2024) ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రటకనలో తెలిపింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలలో విశిష్ట స్థానాల్లో ఉద్యోగులుగా సేవలందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వీరే కాకుండా ప్రముఖ పారిశ్రామికవేత్తలుగా, ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రభుత్వేతర సంస్థలలో ఉన్నతస్థాయి ఉద్యోగులుగా రాణిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులు కూడా హజరవుతారని తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## గురుద్వార్‌లో వీర బాల దివాస్

### హజరైన చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు



**గండిపేట్(క్రైం మిర్రర్):** అత్తాపూర్ నౌనెంబర్ గురుద్వార్‌లో వీర బాల దివాస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు గురుద్వార్ ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులకు నివాళులు అర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1704 సంవత్సరంలో మొగలు నవాబ్ వజీర్‌ఖాన్ మతం మారాలంటూ ఇద్దరు షహజాదేలను చిత్రహింసలు పెట్టారన్నారు. అయినా ధర్మాన్ని మార్చుకోకుండా తొమ్మిదేళ్లు జోరావుర్‌సింగ్, ఏడేళ్లు ఫతేసింగ్ నిరాకరించారన్నారు. 1704 డిసెంబర్ 26న వీరిద్దరు బాలిదానం చేశారన్నారు. బాబా జోరావుర్‌సింగ్, బాబా ఫతేసింగ్ సిక్కుల ప్రథమ గురువు గురుగోవింద్ సింగ్ చిన్న కుమారులు(సాహెబ్‌జాదేలు) అన్నారు. వీరి ధైర్యం, సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా డిసెంబర్ 26న వీర బాల్ దివాస్ ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులను స్మరించుకోవాలని ధర్మం కోసం వారు చేసి ప్రాణత్యాగడం గుర్తుగా జరుపుకోని ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, సాబాద విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శుక్రవారం 27-12-2024



# నేడు గురునానక్ హై స్కూల్‌లో ప్రారంభం కానున్న క్రీడా పోటీలు

**ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎంఈవో శంకర్‌రాథోడ్, విశ్రాంత ఎస్పీ ప్రీతమ్‌సింగ్.**

గండిపేట్(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన సిక్‌చౌనీలోని గురునానక్ హై స్కూల్ మైదానంలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీల నిర్వాహణకు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌చారి, ప్రధాన కార్యదర్శి జి.శ్రావణ్‌కుమార్, కోశాధికారి ఎస్ఆర్ రజనీకాంత్, క్రీడా విభాగ కార్యదర్శులు బోయ లక్ష్మణ్, వేణుగోపాల్‌లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ క్రీడా పోటీలను రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి కె.శంకర్ రాథోడ్, విశ్రాంత ఎస్పీ ప్రీతమ్‌సింగ్ హాజరై ప్రారంభిస్తారన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 4 వేల మంది విద్యార్థులు ఆయా పోటీల్లో తమ ప్రతిభచాటనున్నారన్నారు. అందుకోసం ఇప్పటికే పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, వ్యక్తత్వం, క్యారమ్స్, చెస్, స్పెల్ బీ, అథ్లెటిక్స్, షాట్‌పుట్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ తమవంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన తాండూర్ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని లాల్ సింగ్ తండా గ్రామ వాస్తవ్యులు రాంనాయక్ కుమారుని వివాహ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని.మనోహర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య,మాజీ ఎంపీటీసీ రాంలాల్ నాయక్, కుల్కచర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.వెంకటేశం,గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,అంబర్ షింగ్,తండా పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా

**పదవి కాలం ముగిసిన.. ప్రజాసేవకు కట్టుబడి ఉన్నా**



**మోత్కుపల్లి మాజీ సర్పంచ్ రాంచందర్(రత్నం):** చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):ప్రజా సేవ చేయడానికి పదవి కాలం,ప్రోటోకాల్ అవసరం లేదని మోత్కుపల్లి మాజీ సర్పంచ్ రాంచందర్ (రత్నం)అన్నారు.తాను ఏదైనా మాట ఇస్తే ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసి సేవలందిస్తానని గుర్తుచేశారు.గ్రామానికి చెందిన పెద్దింటి సతీష్ కూతురు విద్యా వివాహం గురువారం జరిగింది.ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి పెళ్లికి ఆర్థిక సహాయంగా చెక్కును అందజేసి రాంచందర్ ఉదారతను చాటుకున్నారు.ఈ మేరకు రాంచందర్ సేవలు ఆనందదాయకమని పలువురు అభినందించారు.ఆయన వెంట చంద్రమౌళి, రాజు, శేఖర్, కార్తీక్, మహేందర్, ప్రశాంత్, రాజేష్, సునీల్, శ్రీకాంత్, కిరణ్, నర్సింహా, తదితరులున్నారు

# ప్రపంచం మెచ్చిన రాజనీతిజ్ఞుడు

యాక్సిడెంటల్ పీఎం. ఈ పదబంధం డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు అచ్చు గుద్దినట్టుగా సరిపోతుంది. నిజానికి ఆయనకున్న భుజకీర్తులు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచమే మెచ్చిన ఆర్థికవేత్త. అనుకోకుండా వచ్చి పడ్డ ముళ్లకిరీటం వంటి ఆర్థిక మంత్రి బాధ్యతలను అత్యంత చాకచక్యంగా నిభాయించి దేశాన్ని సమస్యల సుడిగుండం నుంచి గట్టెక్కించిన మేధావి. ఏకంగా పదేళ్లపాటు ప్రధాని. ఆ ఘనత సాధించిన తొలి సిక్కు.

నెహ్రూ, ఇందిర, మోదీ తర్వాత అత్యధిక కాలం ఆ పదవిలో కొనసాగిన నాయకుడు. సమాచార హక్కు వంటి కీలక చట్టాలు చేసిన సర్కారుకు సారథి. అయినా సరే, మన్మోహన్ పేరు చెప్పగానే ఎవరికైనా మదిలో మెదులేది ఆయన అనూహ్యంగా ప్రధాని అయిన తీరే! అందుకే ఆయనపై రాసిన పుస్తకానికి ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు సంజయ బారు కూడా 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే పేరు పెట్టారు. 'పీఎం మన్మోహన్'కు మీడియా సలహాదారుగా నాలుగేళ్ల పాటు ఆయనను అతి దగ్గరగా చూసిన అనుభవాలన్నింటినీ అందులో నిర్మొహమాటంగా పొందుపరిచారు.

**నిశ్శబ్ద సంస్కర్త**

ప్రధానిగా మన్మోహన్ సారథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా పరుగులు పెట్టింది. మన దేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యా హక్కు వంటి చరిత్రాత్మక చట్టాలు పుట్టుకొచ్చాయి. వామపక్షాలు వ్యతిరేకించినా, ఎన్ని అభ్యంతరాలు ఎదురైనా వెరవక అమెరికాతో మన్మోహన్ కుదుర్చుకున్న పౌర అణు ఒప్పందం మరో మైలురాయి. దౌత్య రంగంలో కూడా పలు

విజయాలకు ఆయన హయాం వేదికైంది. అమెరికా, రష్యా, చైనా వంటి పెద్ద దేశాలతో బంధాలను బలోపేతం చేశారు. ఫలితంగా 2008లో ప్రపంచమంతా పెను ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్నా మన్మోహన్ ముందుచూపు నిర్ణయాల వల్ల భారత ప్రస్థానం మాత్రం స్థిరంగా సాగింది. ఇన్ని చేసినా కృషికి తగ్గ పేరు రాని నిశ్శబ్ద సంస్కర్తగానే మిగిలిపోయారు మన్మోహన్.

**మీరు జోక్ చేస్తున్నారా? ఆర్థిక శాఖ ఆఫర్‌పై మన్మోహన్**

అది 1991. కేంద్రంలో పీవీ సారథ్యంలో కాంగ్రెస్ మైనారిటీ ప్రభుత్వ ఏర్పాటు దేశమంతటా హాట్ టాపిక్‌గా మారింది. మర్నాడే ప్రమాణస్వీకారం. మంత్రివర్గ కూర్పుపై పీవీ మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ సమయాన మన్మోహన్ ఢిల్లీలో తన నివాసంలో కూర్చుని తాపీగా పేపర్ చదువుతున్నారు. అప్పుడు పీవీ ముఖ్య కార్యదర్శి ఆయన ఇంటికి వచ్చారు. 'ప్రధాని మిమ్మల్ని కేబినెట్‌లోకి తీసుకోవాలని అనుకుంటున్నారు. ఆర్థిక శాఖ బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి' అని చెప్పారు. దాన్ని మన్మోహన్ నమ్మలేదు. "నేనా? కేబినెట్‌లోకా? మీరు జోక్ చేస్తున్నారా?" అంటూ నవ్వి ఊరుకున్నారు. తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మర్నాడు ప్రమాణ స్వీకారానికి వేళవుతున్నా మన్మోహన్‌రాష్ట్రపతి భవన్ చేరుకోకపోవడంతో పీవీ ముఖ్య కార్యదర్శి నేరుగా ఆయన ఇంటికి ఫోన్‌చేశారు. 'ప్రమాణానికి టైం దగ్గర పడుతుంటే మీరింకా రాలేదేంటి?' అంటూ హైరానా పడ్డారు. అప్పటికి గానీ తాను నిజంగానే మంత్రిని కాబోతున్నట్టు మన్మోహన్ నమ్మలేదు. దాంతో ఉన్నపళాన బయల్దేరి వెళ్లి ప్రమాణస్వీకారం చేశారు. "అలా నా రాజకీయ జీవితం హడావుడిగా మొదలైంది! కనీసం తయారయ్యే టైం కూడా లేకుండానే ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది" అంటూ 2005లో ఓ బ్రిటిష్ జర్నలిస్టుకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మన్మోహన్ గుర్తు చేసుకున్నారు.

## అవార్డులు.. రివార్డులు

ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి మన్మోహన్ లెక్కలేనన్ని గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. ఎన్నోసార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. 1987లో దేశ రెండో అతి పెద్ద పౌర పురస్కారం పద్మవిభూషణ్ లభించింది. ఎన్నో దేశాలు ఆయనకు తమ అత్యుత్తమ పౌర పురస్కారాలు ప్రదానం చేశాయి.

**కష్టాల బాల్యం**

మన్మోహన్ 1932 సెప్టెంబర్ 26న పంజాబ్‌లోని గహ్ గ్రామంలో జన్మించారు. ఇది ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. చిన్నప్పుడే తల్లి చనిపోతే అమ్మమ్మే అన్నీ తానై పెంచింది. 1947లో దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం అమృత్‌సర్ వలస వచ్చింది. ఆర్థిక కష్టనష్టాలను ఓర్చుకుంటూనే ఆయన విద్యాభ్యాసం సాగించారు. అసాధారణ ప్రతిభతో స్కాలర్‌షిప్‌లు పొందుతూ ఉన్నత విద్య పూర్తి చేశారు. 1952లో పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, 1954లో మాస్టర్స్ పట్టా పొందారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ పొందారు. తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో నఫీల్డ్ కాలేజీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన సమర్పించిన డాక్టోరల్ థీసిస్ 'భారత ఎగుమతి ధోరణులు, స్వయం ఆధారిత వృద్ధి ప్రాతిపదికలు' మన ఆర్థిక వ్యవస్థపై ఆయన లోతైన దృష్టికి తార్కాణం.

**అధ్యాపకునిగా, బ్యూరోక్రాట్‌గా...**

మన్మోహన్ కెరీర్ ఆర్థిక శాస్త్రంలో లెక్చరర్‌గా మొదలైంది. పంజాబ్ యూనివర్సిటీ ,ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో బోధించారు. ఆర్థికశాస్త్రం, విధానాలపై లోతైన అవగాహన ఆయనది. 1966%-%69 మధ్య ఐరాసలోనూ పని చేశారు. అనంతరం అనుకోకుండా బ్యూరోక్రాట్‌గా మారారు. తొలుత వాణిజ్య, పరిశ్రమల శాఖలో ఆర్థిక సలహాదారుగా చేశారు. అనంతరం 1972%-%1976 నడుమ కేంద్ర ఆర్థిక శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగావున్నారు. 1982%-%1985 మధ్య రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా రాణించారు. తర్వాత రెండేళ్లు ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా సేవలందించారు. ఆయా పదవుల్లో ఉండగా మన్మోహన్ రూపొందించిన పలు కీలక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఆధునీకరణ బాట పట్టించడంలో ఎంతగానో దోహదపడ్డాయి.

**మచ్చలేని వ్యక్తిత్వం**

నిజాయితీకి, మచ్చలేని వ్యక్తిత్వానికి ప్రతీక మన్మోహన్. ప్రజా జీవితంలో నాయకులు పాటించాల్సిన విలువలకు బెంచ్‌మార్క్‌గా నిలిచారు. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. అతి నిరాడంబర జీవన శైలి, అన్ని అంశాల మీదా లోతైన అవగాహన సమకాలీన నాయకుల్లో ఆయన్ను అత్యంత విలక్షణంగా నిలిపాయి. నెహ్రూను కూడా కాదని మన్మోహన్‌ను అత్యుత్తమ ప్రధానిగా కుష్వంత్‌సింగ్ వంటి ప్రముఖులు కీర్తించారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రచారం నిమిత్తం తన వద్ద తీసుకున్న రూ.2 లక్షలను మన్మోహన్ గుర్తుతో తిరిగిచ్చిన వైనాన్ని కుష్వంత్ చాలాకాలం పాటు ఎందరితోనో చెప్పుకున్నారు.

**ప్రధానిగా ప్రస్థానం**

మన్మోహన్ జీవితంలో 1991ని కూడా మించిన అత్యంత అనూహ్య మలుపుకు 2004 వేదికైంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ మెజారిటీ సాధించినా సోనియాగాంధీ ప్రధాని కావడంపై అభ్యంతరాలు తలెత్తాయి. సొంత పార్టీ నేతలే ఆమె విదేశీయతను ప్రశ్నించిన పరిస్థితి! దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాని పదవిని సోనియా 'త్యాగం' చేశారు. ప్రణబ్ సహా కాంగ్రెస్ దిగ్గజాలెందరో ఆ పదవికి పోటీ పడ్డా సోనియా మాత్రంసౌమ్యుడైన మన్మోహన్‌కేసి మొగ్గారు. అలా అనుకోకుండా దేశ 13వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా, ఆ అత్యున్నత పదవిలో ఏకంగా పదేళ్లపాటు నిరాఘాటంగా కొనసాగి ఆయన మరో చరిత్ర సృష్టించారు!



**పాలనపై విమర్శ...**

వ్యక్తిగతంగా మన్మోహన్‌ది ఏ మచ్చా లేని జీవితమే అయినా పాలనపరంగా మాత్రం కొన్ని విమర్శలూ ఎదుర్కొన్నారు. యూపీఏ%-%2లో రెండోసారి ప్రధాని అయ్యాక కామన్వెల్త్ క్రీడలు, బొగ్గు, 2జీ స్పెక్ట్రం వంటి కుంభకోణాలు ఆయన ప్రతిష్టను మసకబార్చాయి. బొగ్గు కుంభకోణంపై ప్రశ్నల పరంపరకు, 'వెయ్యి సమాధానాల కంటే మౌనమే మేలు' అంటూ ఆయన బదులిచ్చారు. అవినీతి, నమ్మకద్రోహం, క్రిమినల్ కుట్ర తదితర ఆరోపణలపై బదులిచ్చేందుకు కోర్టుకు రావాల్సిందిగా అనంతర కాలంలో సమన్లు కూడా అందుకోవాల్సి వచ్చింది.

**ఆ మలుపు...**

1991లో మన్మోహన్ జీవితం అనుహ్యమైన మలుపు తిరిగింది. భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయమది. విదేశీ మారక ద్రవ్యం దాదాపుగా నిండుకుంది. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటింది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాలతో ఏ సంబంధమూ లేని మన్మోహన్‌ను ఏకాయెకిన కేంద్ర ఆర్థిక మంత్రిగా నియమించారు. దీనిపై అప్పట్లో పలువురు పెదవి విరిచినా ఆ నిర్ణయం మాస్టర్ స్ట్రోక్‌గా నిలిచింది. మన్మోహన్ విధానాలు, 1991 ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థనే సమూలంగా మార్చేశాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి రూపా యిని విలువ తగ్గించినా, విదేశీ పెట్టుబడులకు బాటలు పరిచినా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించినా అన్నీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నిర్ణయాలే! పీవీ మార్గదర్శకత్వంలో ఆయన చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించి, నేలచూపులు చూస్తున్న మన ఆర్థిక వ్యవస్థ సగర్వంగా తలెత్తుకునేలా చేశాయి. 'ఏ శక్తీ ఆపలేని ఆలోచనలు మనవి' అంటూ 1991 బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్ చెప్పిన మాటలు అక్షర సత్యాలని అనంతర చరిత్ర నిరూపించింది.


## రాహుల్ చించేసిన ఆ ఆర్డినెన్స్...

ప్రధానిగా తన పాలనా కాలం పొడవునా సోనియా నీడలోనే మిగిలిపోయారన్న అపప్రథ మూటగట్టుకున్నారు మన్మోహన్. జాతీయ సలహా మండలి చైర్‌పర్సన్ హోదాలో పదేళ్ల పాటు ఆమె బాధ్యత లేని అధికారాలు చలాయించినా చేష్టలుడిగి చూశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఇక 2013లో సోనియా తనయుడు రాహుల్‌గాంధీ చేసిన పని మన్మోహన్ గౌరవ ప్రతిష్టలను మరింత దిగజార్చింది. కళంకిత నేతలు దోషులుగా తేలినా మూడు నెలల పాటు పదవుల్లో కొనసాగవచ్చంటూ 2013లో కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను 'నాన్సెన్స్' అంటూ రాహుల్ కొట్టిపారేశారు. అంతటితో ఆగకుండా విలేకరుల సమావేశం సాక్షిగా ఆర్డినెన్స్ కాపీని చించేశారు. అది మన్మోహన్‌ను కూడా తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. బహుశా వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే కాబోలు, మన్మోహన్‌ను 'దేశ చరిత్రలోనే అత్యంత బలహీన ప్రధాని'గా బీజేపీ దిగ్గజం ఎల్‌కే అద్వాణీ, 'నైట్ వాచ్‌మన్'గా, 'గాంధీల చేతుల్లో కీలు'మ్మ'గా నరేంద్ర మోదీ అభిర్ణించారు! మన్మోహన్ తన రాజకీయ జీవితంలో ఒక్కసారి కూడా లోక్‌సభకు ఎన్నికవలేదు! ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం 2024 ఏప్రిల్‌తో రాజ్యసభ సభ్యుని హోదాలో ముగిసింది.

# మన్మోహన్ సింగ్ కు ప్రధాని మోదీ సంతాపం..!



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో దేశం అత్యంత విశిష్ట నేతల్లో ఒకరిని కోల్పోయిందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. గురువారం రాత్రి అనారోగ్యంతో బాధ పడుతూ ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ కన్నుమూశారు. ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల యావత్ జాతి దు:ఖ సాగరంలో మునిగిపోయిందని వ్యాఖ్యానించారు. దేశ రూపురేఖలే మార్చేసిన ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ అని 'ఎక్స్'లో ప్రధాని మోదీ పోస్ట్ పెట్టారు. ఏండ్ల తరబడి దేశ ఆర్థిక రంగంపై ఆయన బలమైన ముద్ర వేశారని పేర్కొన్నారు. నిరాడంబర వ్యక్తి నుంచి పేరొందిన ఆర్థిక వేత్తగా ఎదిగారని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ పని చేసినప్పుడు, గుజరాత్ సీఎంగా వివిధ అంశాలపై సవివరంగా చర్చించే వారం అని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పట్ల ప్రధాని మోదీ తీవ్ర సంతాపం తెలిపారు. భరత మాత ముద్దు బిడ్డల్లో ఒకరిగా మన్మోహన్ సింగ్‌కు మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నానని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులు, అభిమానులకు హృదయ పూర్వక సానుభూతి తెలియజేస్తున్నా' అని పేర్కొన్నారు.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో కన్నుమూశారు. రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ మాజీ ప్రధాని మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థిక మంత్రిగా ప్రధానిగా, పదవులకే వన్నెతెచ్చిన గొప్ప రాజకీయ నేత మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.




# హ్యుందాయ్ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.25 వేల వరకు పెంచుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకు లోనుకావడం, లాజిస్టిక్స్ ఖర్చులు అధికం కావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ డైరెక్టర్, సీవోవో తరుణ్ గార్గ్ వెల్లడించారు. కొత్త మాడల్‌తోపాటు పాత మాడళ్లకు కూడా ఈ ధరల పెంపు వర్తించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.5.92 లక్షల విలువైన గ్రాండ్‌ఐ10 నియోస్ నుంచి రూ.46.05 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనం అయోనిక్ 5 మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

# ఈవీ స్టేషన్లు ఏవి?

**చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం**

**కేంద్రం ఆదేశాలను పెడచెవిన పెట్టిన వైనం**

**హైదరాబాద్‌లోనే 150 స్టేషన్లు అవసరం**

**అందుబాటులోకి వచ్చింది కేవలం 72**

**మరో 59 ఏర్పాటుకు సాగుతున్న పనులు**

**19 స్టేషన్లకు స్థలాలే చూడని ప్రభుత్వం**



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను వేగంగా ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశిస్తున్నా, రాష్ట్రంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనూ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రమంతటా 750 చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి సంఖ్యను 2,000 పెంచాల్సిన అవసరం ఉన్నదని అధికారులు గుర్తించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగింది. వీటికోసం కనీసం 150 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో)ను ఆదేశించింది. ఇంతవరకు 72 మాత్రమే నిర్వహణలోకి వచ్చాయి. మరో 59 ఏర్పాటుకు పనులు సాగుతున్నట్టు అధికారులు తెలిపారు. మిగతా 19 ఏర్పాటుకు అవసరమైన స్థలాలను చూపడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తెలిసింది.

%జుజ జష్ట్రుతీస్త్రఱఅస్త్ర

%ప్రభుత్వ స్థలాలివ్వాలన్న కేంద్రం

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల కొరతను అధిగమించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అవరణల్లో ఖాళీ స్థలాలను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు ముసాయిదాను అన్ని రాష్ట్రాలకు పంపింది. ఈ మేరకు ప్రతిపాదనలపై అభ్యంతరాలను, సలహాలను పంపాలని రాష్ట్రాలకు సూచించింది. ఈవీ చార్జింగ్ స్టేషన్లకు స్థలాలు ఇవ్వడానికి నిబంధనలు, టెండర్ బిడ్డింగ్ ప్రక్రియ విధానాన్ని రూపొందించాలని సూచించింది. స్థలాలను పొందేందుకు అందరికీ అవకాశాలు కల్పించాలని, చార్జింగ్ స్టేషన్లు 24 గంటలు పనిచేసేందుకు అవసరమైన అన్నిరకాల అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి, సమస్యల పరిష్కారానికి ఒక ప్రభుత్వ సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించాలని సూచించింది.

**కేంద్రాల ఏర్పాటుకు కమిటీ వేయాలి**

రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, రవాణా, పురపాలక, ఇతర అవసరమైన విభాగాల వారితో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక, పర్యవేక్షణ బాధ్యతలు ఈ కమిటీకి అప్పగించాలని పేర్కొంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖలు కూడా రాసింది. కానీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**ఎన్‌వోసీ తప్పనిసరి**

టీజీ రెడ్కో నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకొని ప్రైవేటు వ్యక్తులు ఎక్కడైనా రోడ్డు పక్కన స్థలం ఉంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ పెట్టుకోవచ్చు. అపార్టుమెంట్లలో అందరికీ ఉపయోగపడేలా చార్జింగ్ స్టేషన్ పెట్టాలన్నా ఎన్‌వోసీ తప్పనిసరి. అది లేకుండానే హైదరాబాద్ నగరంలోని కొన్ని అపార్టుమెంట్లలో చార్జింగ్ స్టేషన్లు పెడుతున్నట్టు అధికారులు గుర్తించారు.

# వాటి జోలికి వెళ్లొద్దు: సెబీ

भारतीय प्रतिभूति और विनिमय बोर्ड
Securities and Exchange Board of India

న్యూఢిల్లీ: అనామక ఆన్‌లైన్ వేదికల ద్వారా లభించే అన్‌లిస్టెడ్ డెట్ సెక్యూరిటీస్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటికి జోలికి వెళ్లరాదని గురువారం ఇన్వెస్టర్లను మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ హెచ్చరించింది. ఈ అన్‌రిజిస్టర్డ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎటువంటి నియంత్రణా ఉండదని, మదుపరుల రక్షణ వ్యవస్థ కూడా లేదని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. కంపెనీల చట్టం 2013ను ఉల్లంఘిస్తూ 200లకుపైగా ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ సెక్యూరిటీస్‌ను అక్రమ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని సెబీ గుర్తించింది. ఈ క్రమంలోనే పైవిధంగా మదుపరులను అప్రమత్తం చేసింది. వీటిలో పెట్టుబడులు పెడితే చాలా ప్రమాదమని గుర్తుచేసింది. కాగా, లిస్టెడ్ డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఆథరైజ్డ్ స్టాక్‌బ్రోకర్లు నిర్వహించే రిజిస్టర్డ్ ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌ల్లోకి మాత్రమే వెళ్లాలని ఈ సందర్భంగా సెబీ సూచించింది. ఇదిలావుంటే గత 30 రోజుల్లో ఎలాంటి లావాదేవీలు జరుపని క్లయింట్స్ ఖాతాల్లోని ఫండ్స్ సెటిల్మెంట్‌కు సెబీ నడుం బిగించింది. 3 పనిదినాల్లో సమస్యను పరిష్కరించేలా స్టాక్ బ్రోకర్లకు సెబీ సూచిస్తున్నది. అలాగే ఈక్విటీ మార్కెట్లలో క్లోజ్ యాక్షన్ సెషన్‌ను సెబీ పరిచయం చేయాలని చూస్తున్నది. దేశంలోని ఈక్విటీ క్యాష్ మార్కెట్‌లో స్టాక్స్ క్లోజింగ్ ధర నిర్ధారణకే దీన్ని ప్రతిపాదిస్తున్నది. ఇక ఎక్స్చేంజీల రిపాజిటరీ ప్లాట్‌ఫామ్‌పై ఐపీవో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిందిగా మర్చంట్ బ్యాంకర్లను సెబీ ఆదేశించింది. మరోవైపు ఫిజికల్ సెటిల్మెంట్ తప్పనిసరిగా ఉన్న డెరివేటివ్స్ మార్కెట్‌లో సెటిల్మెంట్ రిస్కులను పరిష్కరించేందుకు ఫ్యూచర్స్‌లోకి ఐటీఎం ఆప్షన్స్ డివాల్వింగ్‌పై ఓ కన్సల్టేషన్ పేపర్‌ను సెబీ ఇచ్చింది.

# 15 లక్షల కోట్లు పెరిగిన సంపద

**గత ఐదు రోజుల్లో పరుగులు పెట్టిన మార్కెట్ క్యాప్**

**వరుస లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు**

**ఒక్కరోజే సెన్సెక్స్ 810, నిఫ్టీ 241 పాయింట్లు వృద్ధి**

**ఐటీ, టెక్ కంపెనీల షేర్లు ఆకర్షణీయం**



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ.. పయనించినా, ఆఖర్లో మాత్రం లాభాల్లోనే ముగుస్తున్నాయి. ఇలా వరుసగా 5 రోజుల్లో మదుపరుల సంపద సైతం లక్షల కోట్ల రూపాయల్లో పెరగడం విశేషం. గురువారం ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 809.53 పాయింట్లు లేదా 1 శాతం పుంజుకొని 81,765.86 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,361.41 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. అయితే ఈ దశలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ దిగిరాక తప్పలేదు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 240.95 పాయింట్లు లేదా 0.98 శాతం ఎగిసి 24,708.40 దగ్గర నిలిచింది.

**అమెరికా జోష్**

భారతీయ ఈక్విటీలు ఇంతలా బలపడటానికి అమెరికా మార్కెట్ల ర్యాలీ బాగా కలిసొచ్చింది. అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయ వృద్ధిని కనబరుస్తుండటం, ద్రవ్యోల్బణం దిగొస్తుండటంతో తొలిసారి డోజోన్స్ 45వేల మార్కును దాటింది. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచీ అమెరికా వృద్ధి సూచీలు పరుగులు పెడుతున్నాయి మరి. అక్కడి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ చీఫ్ పావెల్ కూడా దేశ ఆర్థిక ముఖచిత్రం బాగుపడిందని కొనియాడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలపర్చింది. ఇక దేశీయంగా చూస్తే.. ఐటీ కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను అందుకున్నాయి. ఐటీ రంగ సూచీ గరిష్ఠంగా 1.96 శాతం పెరిగింది.

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు**

గతకొంత కాలంగా దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ దిశగా అడుగులు వేస్తున్న విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ).. మళ్లీ కొనుగోళ్ల వైపు వచ్చారు. బుధవారం రూ. 1,797.60 కోట్ల విలువైన షేర్లను కొన్నట్టు స్టాక్ ఎక్స్చేంజీ వర్గాలు తెలిపాయి. దీంతో గురువారం సైతం ఇదే జోష్ ఉందన్న అంచనాలు వస్తున్నాయి. ఇక సెన్సెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 0.27





# లక్ష డాలర్లకు బిట్‌కాయిన్

న్యూయార్క్: అదృశ్య కరెన్సీ బిట్‌కాయిన్ జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ఈ బిట్‌కాయిన్ తాజాగా లక్ష డాలర్లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంఫ్ గెలిచినప్పటీ నుంచి ఈ కరెన్సీ భారీగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గురువారం బిట్‌కాయిన్ విలువ 103,400 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాది ఈ అదృశ్య కరెన్సీని కొనుగోలు చేసిన వారు కోటీశ్వరులైనారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

# క్విక్ కామర్స్‌లోకి మింత్రా

**30 నిమిషాల్లో ఉత్పత్తుల డెలివరీ**

**ఎక్స్చేంజ్, రిటర్న్ సౌకర్యం కూడా**




హైదరాబాద్: ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఈ%-%కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్రా క్విక్ కామర్స్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. 'ఎం%-%నౌ' పేరుతో 30 నిమిషాల్లోనే ఉత్పత్తులను డెలివరీ చేయనున్నట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ప్రస్తుతం బెంగళూరులో ఈ సేవలను అందిస్తోంది. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా మెట్రో, నాన్%-%మెట్రో నగరాల్లో విస్తరించడానికి సిద్ధంగా ఉన్నామని మింత్రా సీఈవో నందిత సిన్హా తెలిపారు. % ఉత్పత్తుల కొనుగోలు కోసం సమయం వృథా కాకుండా ఎం%-%నౌ సౌకర్యవంతమైన పరిష్కారం అని చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ బ్రాండెడ్ లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను వినియోగదార్లు కేవలం 30 నిమిషాల్లోనే అందుకోవచ్చని కంపెనీ ప్రకటన తెలిపింది. ఫ్యాషన్, బ్యూటీ, యాక్సెసరీస్, గృహ విభాగంలో 10,000 కంటే ఎక్కువ ఉత్పత్తుల శ్రేణిని ప్రస్తుతం ఎం%-%నౌ లో అందిస్తోంది. 3%-%4 నెలల్లో ఈ సంఖ్యను లక్షకు పైచిలుకు చేర్చనున్నట్టు మింత్రా వెల్లడించింది. నవంబర్‌లో బెంగళూరులో మింత్రా క్విక్ కామర్స్ పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించింది. పైలట్ ప్రాజెక్టులో కస్టమర్ల నుంచి సానుకూల స్పందన లభించిందని సిన్హా వ్యాఖ్యానించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, మరింతగా విస్తరిస్తామని చెప్పారు. ఇతర క్విక్ కామర్స్ కంపెనీల మాదిరిగా కాకుండా ఉత్పత్తుల మార్పిడి, వెనక్కి ఇచ్చే సౌకర్యం కూడా ఉందని నందిత వెల్లడించారు. కాగా, మెట్రో నగరాల్లో మింత్రా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు 2022లో శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఆర్డర్ పెట్టిన 24%-%48 గంటల్లో ఉత్పత్తులను డెలివరీ చేస్తోంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
స్పోర్ట్స్
8
శుక్రవారం
27-12-2024



# సెమీస్‌కు బెంగాల్

హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ టోర్నీ సంతోష్ ట్రోఫీలో పశ్చిమ బెంగాల్ జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం హైదరాబాద్‌లోని డెక్కన్ ఏరీనా వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగాల్.. 3-1తో ఒడిషాను ఓడించింది. ఈ టోర్నీలో బెంగాల్ సెమీస్‌కు చేరడం ఇది 52వ సారి కావడం విశేషం. ఒడిషా తరఫున రాకేశ్ ఓరమ్ 25వ నిమిషంలో తొలి గోల్ చేసి ఆ జట్టును ఆధిక్యంలోకి తీసుకొచ్చినా ఆ తర్వాత బెంగాల్ పుంజుకుంది. రాబొ హన్స్‌డ రెండు గోల్స్ చేయగా సబ్‌స్టిట్యూట్ మనొటొస్ మార్ఖి ఒక గోల్ చేశాడు.

# పాక్ 211 ఆలౌట్



సెంచూరియన్: స్వదేశంలో పాకిస్థాన్‌తో ఆడుతున్న తొలి టెస్టు మొదటి రోజే మ్యాచ్‌పై దక్షిణాఫ్రికా పట్టు సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన సఫారీలు.. తొలి ఇన్నింగ్స్‌లో పాక్‌ను 211 పరుగులకే కుప్పకూల్చారు. డేన్ పీటర్సన్ (5/61) ఐదు వికెట్లతో చెలరేగగా కార్బిన్ బోష్ (4/63) పాక్ బ్యాటర్ల ఆట కట్టించారు. కమ్రన్ గులామ్ (54) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన సౌతాఫ్రికా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది.

# సెమీస్‌లో యూపీ యోధాస్, పట్నా పైరేట్స్

### ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో ఓడిన మాజీ చాంపియన్స్ జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా

పుణే: గత ఏడాది ప్రొ కబడ్డీ లీగ్‌లో 11వ స్థానంతో సరిపెట్టుకున్న యూపీ యోధాస్ ఈసారి మాత్రం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన తొలి ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీ యోధాస్ 46%-%18 పాయింట్ల తేడా మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టును చిత్తుగా ఓడించింది. రెయిడర్ భవానీ రాజ్‌పుత్ 12 పాయింట్లతో మెరిసి యూపీ యోధాస్‌ను సెమీఫైనల్‌కు చేర్చాడు. హితేశ్ 6 పాయింట్లు రాబట్టగా... గగన్ గౌడ, సుమిత్ 5 పాయింట్ల చొప్పున సాధించారు. భవానీ రాజ్‌పుత్ 14 సార్లు రెయిడింగ్‌కు వెళ్లాడు. 9 సార్లు పాయింట్లతో తిరిగి వచ్చాడు. రెండుసార్లు దొరికిపోగా, మూడుసార్లు పాయింట్ సాధించకుండానే వెనక్కి వచ్చాడు. మరోవైపు పింక్ పాంథర్స్ జట్టు సమష్టిగా విఫలమైంది.



# టాప్ లేపారు

### బాక్సింగ్ డే టెస్టులో ఆసీస్ టాపార్డర్ జోరు

### నలుగురు బ్యాటర్ల అర్ధ సెంచరీలు

### కాన్‌స్టాస్ మెరుపులు

### తొలి రోజు ఆసీస్ 311/6

### చివర్లో పుంజుకున్న భారత్

**బాక్సింగ్ డే టెస్టు పేరుకు తగ్గట్టే తొలి రోజు బ్యాటర్ల దూకుడుతో ప్రారంభమైంది. ఆతిథ్య ఆస్ట్రేలియా తరఫున అరంగేట్ర కుర్రాడు సామ్ కాన్‌స్టాస్ నాటు కొట్టుడుకు తోడు సీనియర్ బ్యాటర్లు ఖవాజా, లబుషేన్, స్మిత్ నిలకడైన ఆటతీరుతో మొదటి రోజు ఆటలో కంగారూలు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఆడుతున్నది తొలి టెస్టు అయినా భయమన్నదే లేకుండా క్రీజులో మెరుపులు మెరిపించిన కాన్‌స్టాస్.. ఆసీస్‌కు అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఈ సిరీస్‌లో కంగారూలను ముప్పు తిప్పలు పెడుతున్న బుమ్రాతో పాటు ఇతర బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డాడు. కాన్‌స్టాస్ నిష్క్రమించినా మిగిలిన బ్యాటర్లు జోరు కొనసాగించారు. కంగారూల బ్యాటింగ్‌కు తేలిపోయి రెండు సెషన్ల పాటు వికెట్ల వేటలో వెనుకబడ్డ భారత బౌలర్లు చివరి సెషన్‌లో కీలకమైన నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం.**



మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికగా సుమారు 87వేల మంది ప్రేక్షకులు హాజరైన భారత్, ఆస్ట్రేలియా బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు ఆతిథ్య జట్టు బ్యాటింగ్‌లో అదరగొట్టింది. ఎంసీజీలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు వరుసగా నలుగురు టాపార్డర్ బ్యాటర్లు అర్ధసెంచరీలతో మెరవడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. అరంగేట్ర మ్యాచ్‌లోనే యువ ఓపెనర్ సామ్ కాన్‌స్టాస్ (65 బంతుల్లో 60, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) టీ20 తరహా ఆటకు తోడు సీనియర్లు మార్నస్ లబుషేన్ (145 బంతుల్లో 72, 7 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (111 బంతుల్లో 68 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), ఉస్మాన్ ఖవాజా (121 బంతుల్లో 57, 6 ఫోర్లు) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. తొలి రెండు సెషన్లూ కంగారూల ఆధిపత్యం కొనసాగిన మ్యాచ్‌లో ఆఖరి సెషన్‌లో టీమ్ఇండియా పుంజుకుంది. బుమ్రా (3/75)తో పాటు ఇతర బౌలర్లు రాణించడంతో రోహిత్ సేన ఊపిరి పీల్చుకుంది.

**సీనియర్ల నిలకడ**

కాన్‌స్టాస్ మెరుపులు ముగిసిన తర్వాత మెల్‌బోర్న్‌లో ఆసీస్ సీనియర్ల షో మొదలైంది. లంచ్ అనంతరం ఖవాజా, లబుషేన్ భారత బౌలర్లను విసిగించారు. ఈ ఇద్దరూ డిఫెన్స్‌కే ప్రాధాన్యమిస్తూ వీలుచిక్కినప్పుడల్లా పరుగులు రాబట్టారు. 101 బంతుల్లో ఖవాజా ఫిఫ్టీ పూర్తయింది. ఈ సిరీస్‌లో అతడికి ఇదే తొలి అర్ధ సెంచరీ. రెండో వికెట్‌కు 150 బంతుల్లో 65 పరుగులు జోడించిన ఈ జోడీని డ్రింక్స్ తర్వాత ఎట్టకేలకు బుమ్రా విడదీశాడు. ఈ సిరీస్‌లో బుమ్రా బౌలింగ్‌లో ఔటవడం ఖవాజాకు ఇది ఐదోసారి. ఖవాజా స్థానంలో వచ్చిన స్మిత్ కూడా తనకు ఎంతో ఇష్టమైన ఎంసీజీలో ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరినీ ఔట్ చేయడానికి రోహిత్.. బౌలర్లను మార్చి మార్చి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. 114 బంతుల్లో లబుషేన్ హాఫ్ సెంచరీ పూర్తయింది.

**చివరి పంచ్ మనదే**

ప్రమాదకరంగా మారుతున్న లబుషేన్-స్మిత్ జోడీని రెండో సెషన్ డ్రింక్స్ విరామం తర్వాత వాషింగ్టన్ సుందర్ విడదీశాడు. అతడు వేసిన తొలి బంతిని మిడాఫ్ దిశగా ఆడబోయిన లబుషేన్.. కోహ్లీకి దొరికిపోయాడు. అతడి స్థానంలో క్రీజులోకి వచ్చిన ప్రమాదకర ట్రావిస్ హెడ్ (0) డకౌట్ అయ్యాడు. బుమ్రా వేసిన బంతిని తప్పుగా అంచనా వేసిన హెడ్.. మూల్యం చెల్లించుకోక తప్పలేదు. తన తర్వాతి ఓవర్లో బుమ్రా.. మిచెల్ మార్ష్ (4)నూ పెవిలియన్‌కు పంపాడు. అలెక్సీ కేరీ (31)ని ఆకాశ్ దీప్ అద్భుతమైన లెంగ్త్ డెలివరీతో బోల్తా కొట్టించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి స్మిత్, సారథి పాట్ కమిన్స్ (8 నాటౌట్) క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆసీస్‌ను వీలైనంత త్వరగా ఆలౌట్ చేసి ఆ జట్టుకు దీటుగా బ్యాటింగ్ చేయడం భారత్ ముందున్న కర్తవ్యం.

**కుర్రాడి నాటు కొట్టుడు**

కొంతకాలంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుపులు మెరిపిస్తూ జాతీయ జట్టు నుంచి పిలుపు అందుకున్న యువ ఓపెనర్ కాన్‌స్టాస్.. తన తొలి మ్యాచ్‌లోనే అంచనాలకు మించి రాణించాడు. 19 ఏండ్ల 85 రోజులకే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ కుర్రాడు.. ప్రమాదకర బుమ్రాతో పాటు భారత బౌలర్లనూ ఆటాడుకున్నాడు. ఆడుతున్నది తొలి మ్యాచే అయినా ఏమాత్రం బెరుకు లేకుండా ఆది నుంచే దంచుడు మంత్రాన్ని పఠించాడు. ఎదుర్కున్న మొదటి 21 బంతుల్లో అతడు 5 పరుగులే చేశాడు. కానీ అది తుఫాను ముందు ప్రశాంతతే. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్ నుంచి మొదలైంది కాన్‌స్టాస్ కొట్టుడు. ఆ ఓవర్ తొలి బంతిని బౌండరీకి తరలించిన అతడు రెండో బంతిని సిక్సర్‌గా మలిచాడు. ఈ రెండూ రివర్స్ స్కూప్ షాట్లే. 2021 తర్వాత టెస్టులలో బుమ్రా బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన తొలి క్రికెటర్ కాన్‌స్టాసే. ఈ ఓవర్లో 14 పరుగులు పిండుకున్న అతడు.. బుమ్రానే వేసిన 11వ ఓవర్లో 4, 6, 4, 2తో ఏకంగా 18 పరుగులు రాబట్టాడు. కాన్‌స్టాస్ దూకుడుతో ఆసీస్ స్కోరు వేగం పుంజుకుంది. 52 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న అతడు.. జడేజా 20వ ఓవర్లో రెండో బంతికి వికెట్ల ముందు దొరికిపోవడంతో 89 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

**కోహ్లీకి జరిమానా**

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఐసీసీ షాకిచ్చింది. మెల్‌బోర్న్ టెస్టు తొలిరోజు ఆటలో భాగంగా కోహ్లీ.. ఆసీస్ ఓపెనర్ కాన్‌స్టస్‌ను కవ్వించడంతో పాటు వాగ్వాదానికి దిగినందుకు గాను ఐసీసీ తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.12ను అతడు ఉల్లంఘించాడని మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తెలిపాడు. బుమ్రా వేసిన 11వ ఓవర్లో కోహ్లీ.. నాన్ స్ట్రయికర్ ఎండ్ నుంచి వస్తున్న కాన్‌స్టాస్ భుజాన్ని తోసుకుంటూ వెళ్లిపోయాడు. ఇదే సమయంలో కాన్‌స్టాస్ ఏదో అనడంతో దానికి కోహ్లీ కూడా దీటుగా స్పందించాడు. దీంతో ఇరువురి మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కోహ్లీపై ఒక మ్యాచ్ నిషేధం విధించాలని డిమాండ్లు వచ్చినా అతడు తప్పు ఒప్పుకోవడంతో మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా: 86 ఓవర్లలో 311/6 (లబుషేన్ 72, స్మిత్ 68, బుమ్రా 3/75, వాషింగ్టన్ 1/37)

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# విద్యుత్ ఛార్జీల పాపం జగన్‌దే

### జెన్‌కోను సర్వనాశనం చేసారు.. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ హయాంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఏపీ జెన్‌కో) సర్వనాశనం అయ్యిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై జగన్ ధర్నాకు పిలుపునిచ్చారని ఆయన విమర్శించారు. ట్రూ అప్ చార్జీల భారం కచ్చితంగా జగన్ రెడ్డిదే అని, సీఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయని ఆయన ఎద్దేవా చేశారు. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని జగన్ ఈఆర్సీని కోరారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. 'తుగ్లక్ చర్యల్లో వైఎస్ జగన్ మరో మైలురాయి దాటారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాకు పిలుపునిచ్చారు. ట్రూ అప్ చార్జీల భారం కచ్చితంగా జగన్ మోహన్ రెడ్డిదే. సీఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయి. పీపీఏల రద్దు, సోలార్, విండ్ పెట్టుబడిదారులను బెదిరించి విద్యుత్ లోటుకు కారణం అయ్యారు. జగన్ హయాంలోనే ఏపీ జెన్కో సర్వనాశనం అయ్యింది. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని జగన్ ఈఆర్సీని కోరారు. నేడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. జగన్ హయాంలోనే వసూళ్లకు డిస్కంలు అనుమతి కోరాయి. వాయిదా వేస్తూ కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారు' అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

# విశాఖ ఉక్కుపై మోడీ సవతితల్లి ప్రేమ

### తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలి

### కర్నాటకపై ఉన్న ప్రేమ విశాఖపై లేదు

### పిసిసి చీఫ్ షర్మిల ఘాటు విమర్శలు

విజయవాడ,డిసెంబర్26(ఆర్ఎన్ఎ): విశాఖ ఉక్కును ఉద్ధరిస్తున్నామని కేంద్రం చెప్తున్నవన్నీ అసత్యాలేనని, స్టీల్ ఎ÷–లాంట్ మీద కేంద్రానికి ఉండేది ఎన్నటికీ సవతి తల్లి ప్రేమనేనని పిసిసిచీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. మోడీకి కన్నడ ఉక్కు మీదున్న ప్రేమ ఆంధ్రుల హక్కు మీద లేదని తీవ్ర విమర్శలు చేశారు. విశాఖ స్టీల్ ను దివాలా తీయించే ఎత్తుగడలు సాగుతూనే ఉన్నాయని,- మోడీ సన్నిహితులకు పదో పరక కింద అమ్మే కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణ లేదు అంటూనే రూపాయి సహాయం చేయకుండా ప్లాంట్ ను మూసేసే కుట్ర కేంద్రం చేస్తుందన్నారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ఊఆ కుమారస్వామి ప్రాతినిధ్యం వహించే రాష్ట్రంలో కర్ణాటక స్టీల్ ప్లాంట్ కి



రూ.15వేల కోట్ల సహాయం అందించి ఆ స్టీల్ ప్లాంట్ ను బ్రతికించారని అన్నారు. కేవలం 243 మంది పనిచేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్ కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్రానికి.. 26 వేల మంది పనిచేసే విశాఖ స్టీల్ ను ఆదుకోవడానికి మనసు లేదని విమర్శించారు. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం ఉండే జెడిఎస్ రూ.15వేల కోట్లు నిధులు రాబట్టుకుంటే.. బిజెపికి ఊపిరి పోసిన టీడీపీ,- జనసేన పార్టీలు మోడీకి సలాం కొడుతున్నాయని.. 18 మంది ఎంపీలు కేంద్రానికి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ముడిసరుకు కొరతతో ఉత్పత్తి తగ్గిందని, - ప్లాంట్ దివాలా తీసే స్థాయిలో ఉందని, కేంద్రం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించి ఆదుకోవాలని కోరారు. కార్మికులు 1400 రోజులుగా ఉద్యమాలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మోడీతో మిట్టల్ స్టీల్ గురించి చర్చ చేస్తున్నారని మండిపడ్డారు.

-వైజాగ్ స్టీల్ కు కేంద్రం నిధులు ఇవ్వాలని.. ప్లాంట్ ను సెయిల్‌లో వెంటనే విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 7 మిలియన్ టన్నుల ఉత్పత్తి ప్రారంభించి.. భవిష్యత్తులో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెంచాలని సూచించారు. - ఇవి సాధించడం చేతకాకపోతే వెంటనే ఔఅం భాగస్వామ్యం నుంచి టీడీపీ, జనసేనలు తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

## రేవంత్‌కు సోఫా పంపాల్సిందే

### ఎక్స్ వేదికగా అంబటి సెటైర్లు


**గుంటూరు, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలపై తరచూ విమర్శలు చేసే వైసీపీ నేత అంబటి రాంబాబు ఈసారి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు. సినీ ప్రముఖులు ఆయనతో భేటీ అయిన టైంలో ఓ సెటైరిక్ పోస్టు పెట్టారు. ఎక్స్ వేదికగా పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందేనంటూ రాసుకొచ్చారు. పుష్ప-2లో 'సోఫా' సీన్స్ ఉంటాయి. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, తనకు అనుకూలంగా పని చేసే వాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో భారీ స్థాయిలో డబ్బు ఉంచి పంపిస్తుంటారు. అదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావించారు. అంటే డబ్బులు ఇస్తే సినిమా ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరిస్తామంటూ అర్థం వచ్చేలా ఆయన ఈ ట్వీట్ చేశారు. సంధ్య థియేటర్ కేసులో మొదటి నుంచి అల్లు అర్జున్‌ను వైసీపీ వెనకేసుకొచ్చింది. అల్లు అర్జున్‌ను అనవసరంగా రేవంత్ ప్రభుత్వం అరెస్టు చేసిందని ఆరోపించింది. ఇందులో ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పాత్ర ఉందని విమర్శలు కూడా చేసింది.

## మణిపూర్‌లో మరోసారి కాల్పుల ఘటనలు

**ఇంఫాల్, (క్రైమ్ మిర్రర్):** మణిపూర్‌లో మరోసారి కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని పలు చోట్ల కాల్పులు జరిగాయి. యోంగాంగ్‌పోక్పి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంఫాల్ ఈస్ట్ మరియు కాంగ్‌పోక్పీ జిల్లాలోని తమ్నాపోక్పి గ్రామం, ఉయోక్ చింగ్‌లో వరుసగా ఘటనలు జరిగాయి. మంగళవారం రాత్రి నుండి సాయుధ గ్రూపుల మధ్య బాంబుదాడులతో పాటు భారీ ఎదురుకాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. క్రిస్మస్ పండుగ రోజైన బుధవారం కూడా సగోల్‌మాంగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సినం గ్రామంలో కాల్పులు జరిగాయని అన్నారు. ఉద్దేశపూర్వక కాల్పుల కారణంగానే ఈ రెండు ఘటనలు జరిగి ఉండవచ్చని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఏగ్రూపుల మధ్య కాల్పులు జరిగాయనే అంశంపై స్పష్టత లేదని పేర్కొన్నారు. దర్యాప్తు జరుగుతోందని అన్నారు.

## ఖరీదైన కారుకు మంటలు

### 45 నిమిషాలు శ్రమించి మంటలు ఆర్పివేసిన సిబ్బంది



**ముంబై, (క్రైమ్ మిర్రర్):** మహారాష్ట్ర ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్‌లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.

## ఇండియాలో కూటమి భగ్గుమన్న విభేదాలు

### ఆప్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు..?



**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆప్ మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతో ఈ వైరం మరింత ముదురుతోంది. తాజాగా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ హస్తం పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆప్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీలను ఒప్పించేందుకు ఆప్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు.

# కూటమి తప్పుడు ప్రచారం వల్లే ఓడాం

### జైల్లో పెట్టుకుంటావా పెట్టుకో...చూసుకుంటాం

### పార్టీ సమావేశంలో మాజీమంత్రి రోజా సవాల్



**నగరి, (క్రైమ్ మిర్రర్):** ఎన్నికల్లో తప్పులు చేసి మనం ఓడిపోలేదు.. కూటమి ప్రభుత్వ తప్పుడు ప్రచారం వల్ల ఓడిపోయాం అని మాజీమంత్రి, నటి రోజా అన్నారు. ఈసారి కచ్చితంగా మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది అని పార్టీ శ్రేణులకు ఆమె ధైర్యం చెప్పారు. ఈ మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత ఆర్కే రోజా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నగరిలో జరిగిన వైఎస్సార్ సిపి పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏపీ సిఎం చంద్రబాబునుద్దేశించి 'జైల్లో పెడతావా..? పెట్టుకో.. కేసులు పెడతావా? పెట్టుకో.. ఉద్యోగాలు తీసేస్తావా తీసేసెయ్..! ' అని సవాల్ విసిరారు. మళ్లీ మా ప్రభుత్వం వస్తుంది.. వడ్డీతో సహా తిరిగి ఇస్తామని' ఆమె కూటమి ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తల పేర్లను గుడ్ బుక్‌లో రాసి పెట్టుకుంటాం.. వారిని గుర్తుపెట్టుకుంటామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగస్తులందరూ ఎగిరెగిరి పడ్డారు.. మన ప్రభుత్వాన్ని దించేంతవరకు ఉద్యోగులందరూ కంకణం కట్టుకొని పనిచేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో వారే నరకయాతన అనుభవిస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు, చంద్రబాబుకు, లోకేష్ కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ఏపీ యువతకు ఉద్యోగాలు రాలేదు రోజా ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆమె.. మనం తప్పులు చేసి ఓడిపోలేదు.. ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఆలీబాబా ఆరడజను దొంగల్లా మారిందని విమర్శించారు. ఏపీ ప్రజలకు నరకం అంటే ఎంటో కూటమి ప్రభుత్వం చూపిస్తుందన్నారు.. జగన్‌ను ఓడించి తప్పుచేశామని ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.. పశ్చాత్తాప పడుతున్నారని వ్యాఖ్యానించారు.. సంపద సృష్టిస్తా అని చెప్పిన చంద్రబాబు అప్పుల మీద అప్పులు సృష్టిస్తున్నారు? ఎన్నికల ప్రచారంలో పచ్చ చొక్కాలు వేసుకుని, పచ్చ చీరలు కట్టుకుని నీకు 15 వేలు నీకు 15 వేలు అంటూ టిడిపి నేతలు అబద్దాలు చెప్పారని ఆమె మండిపడ్డారు. జగన్ బిజినెస్ మాన్ గా, పార్టీ అధినేతగా, ఫ్యామిలీ మెన్ గా సక్సెస్ అయిన వ్యక్తి అని ఆమె అభివర్ణించారు. మరోవైపు పార్టీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉద్దేశించి మన పార్టీలోని కొందరు చేసిన దిగజారుడు రాజకీయాల వల్ల ఎప్పుడూ అత్యధిక స్థానాలు గెలిచే జిల్లాలో ఈసారి గెలవలేకపోయామన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా భుమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కుప్పంతో సహా 14 స్థానాలను గెలుస్తామని రోజా ధీమా వ్యక్తం చేశారు.



## 10 నుండి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనం

### వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక కౌంటర్ల ద్వారా టిక్కెట్ల విక్రయం

**తిరుమల, (క్రైమ్ మిర్రర్):** తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుండి 1.20 లక్షల టోకెన్లు భక్తులకు జారీ చేస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లు జారీ చేస్తామని ఈవో తెలిపారు.తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి, భూదేవి కాంప్లెక్స్, జీవకోన హైస్కూల్, ఇందిరా మైదానం , శ్రీనివాసం, విష్ణునివాసం, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎంఆర్ పల్లి స్కూల్‌లతో పాటు తిరుమలలో బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో తిరుమల స్థానికుల కొరకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫోటో గుర్తింపుతో కూడిన స్లిప్‌లను జారీ చేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజులలో శ్రీవారి దర్శనం ఉండదని తెలిపారు. కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, వేచి ఉండే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల కేంద్రాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవో గౌతమి, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌లతో కలిసి ఈవో తనిఖీ చేశారు. ఈవో వెంట సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, మనోహర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, తదితర టీటీడీ అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## తమిళనాడులో అదుపుతప్పిన శాంతిభద్రతలు

### డిఎంకెను గద్దె దించే వరకు చెప్పులు ధరించను

### రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ

**కోయంబత్తూర్, (క్రైమ్ మిర్రర్):** తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నాయూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను' అని అన్నామలై అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు. మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన 'ఎఫ్ఐఆర్'ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు జ్ఞానశేఖరన్‌పై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

# థియేటర్లలోనే ఇండియన్-3



కమల్‌హాసన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ భారతీయుడు. శంకర్ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే ఇండియన్ కూడా వచ్చిందని తెలిసిందే. ఈ ఏడాది జులై 12న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. వాయిదాల మీద వాయిదాలు పడి విడుదలైన సీక్వెల్ నిర్మాతలకు నష్టాలనే మిగిల్చడంతో ఇక మూడో పార్ట్ ఇండియన్ 3ని థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదల కానుందంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్నాయి. ఇండియన్ 2 అలాంటి నెగెటివ్ రివ్యూస్ వస్తాయని అస్సలు ఊహించలేదు. సరేనంటూ ముందుకెళ్లాను. నేను నా వర్క్‌ను నమ్ముతా. అదేంటో గేమ్ ఛేంజర్, ఇండియన్ 3 సినిమాలే చెబుతాయి. ఈ రెండు సినిమాలు తప్పకుండా థియేటర్లలో ఎంజాయ్ చేసే విధంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశాడు. అంతేకాదు ఇండియన్ 3 థియేటర్లలో విడుదల కానుందని క్లారిటీ ఇచ్చేశాడు. దీంతో కమల్ హాసన్ అభిమానులు ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు. తాజా టాక్ ప్రకారం గేమ్ ఛేంజర్ విడుదలైన తర్వాత ఇండియన్ 3 ప్రమోషన్స్ కూడా షురూ చేయబోతుందట శంకర్ టీం. అంతేకాదు ట్రైలర్ కూడా త్వరలోనే థియేటర్లలో సందడి చేయబోతుందని ఇన్‌సైడ్ టాక్. సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేసేలా ట్రైలర్ ఉండబోతుందట. ఇంకేంటి మరి తక్కువ టైంలోనే శంకర్ అభిమానుల కోసం రెండు సినిమాలు రాబోతున్నాయన్న మాట.

## క్రిష్‌తోపాటే నేను బయటకు వచ్చా : డైలాగ్ రైటర్ సాయిమాధవ్ బుర్రా

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి హరిహరవీరమల్లు. ఈ సినిమాకు మొదట టాలెంటెడ్ డైరెక్టర్ క్రిష్ దర్శకత్వం వహించాడని తెలిసిందే. కాగా ఈ చిత్రానికి పాపులర్ రైటర్ సాయిమాధవ్ బుర్రా డైలాగ్ రైటర్‌గా ఫైనల్ చేశారు మేకర్స్. అయితే పలు కారణాల వల్ల అనూహ్యంగా క్రిష్ ఈ ప్రాజెక్టు నుంచి బయటకు రాగా.. ఏఎం జ్యోతికృష్ణ డైరెక్టర్‌గా మారాడు. ఈ నేపథ్యంలో క్రిష్‌తోపాటే తాను కూడా ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చానన్నారు పాపులర్ డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా. ఓ ఇంటర్వ్యూలో సాయి మాధవ్ బుర్రా మాట్లాడుతూ.. హరిహరవీరమల్లులో క్రిష్ ఉన్నంతవరకు నేను కూడా ఉన్నా. సినిమా నుంచి క్రిష్ బయటకు వచ్చిన తర్వాత ఆయనతోపాటు నేను కూడా వచ్చేశానన్నారు. హరిహరవీరమల్లు చాలా గొప్ప సబ్జెక్ట్ అని.. సినిమా ఎప్పుడెప్పుడు వస్తదా.. అని ఎదురుచూస్తున్నానన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రంలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్న ఈ మూవీ రెండు పార్టులుగా రానుంది. పార్ట్ 1ను మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్.





## ఆకట్టుకుంటున్న వెంకీ సాంగ్


టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ కాంపౌండ్ నుంచి రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన మీను సాంగ్ ప్రోమో నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. తాజాగా మేకర్స్ ఫుల్ లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో, ప్రణవి ఆచార్య పాడారు. మీనాక్షి చౌదరి వెంకీను ఫాలో అవుతూ సాగే ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. వెంకీ నుంచి అభిమానులు కోరుకునే ఎలిమెంట్స్‌తో సాగుతున్న ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే సాంగ్ లాంచ్ చేయగా.. మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ దూసుకెళ్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

## తగ్గేదేలే.. బేబీజాన్ ప్రమోషన్‌లో మంగళసూత్రంతో కీర్తిసురేష్

బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం బేబీ జాన్. నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది కీర్తిసురేశ్. డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది బేబిజాన్ టీం. కాగా కీర్తిసురేశ్ ఇటీవలే ఆంథోని తటిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. వెడ్డింగ్ తర్వాత కూడా ఏ మాత్రం కాంప్రమైజ్ కాకుండా పక్కా ప్రొఫెషనల్‌గా కనిపిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. రెడ్ డ్రెస్‌లో టీంతో కలిసి కనిపించగా.. మెడలో మంగళసూత్రం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మొత్తానికి పెళ్లి తర్వాత కూడా సినిమాల విషయంలో ఏ మాత్రం తగ్గేదే లే అంటూ చెప్పకనే చెబుతోందంటున్నారు నెటిజన్లు, అభిమానులు, ఫాలోవర్లు. అంతేకాదు పెళ్లి తర్వాత వస్తున్న హిందీ డెబ్యూ సినిమా సక్సెస్ అవ్వాలని విష్ చేస్తున్నారు.



## అలాంటి అబ్బాయి కావాలి : రష్మిక



అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'పుష్ప–2' విజయోత్సాహంలో ఉన్న ఈ భామ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన లైఫ్‌లోకి రాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరించింది. జీవితంలోని ప్రతీ మలుపులో అతను తోడుండాలని, కష్టసమయంలో అండగా నిలబడాలని, అన్నివేళల్లో భద్రతనివ్వాలని చెప్పింది. రష్మిక మందన్న మాట్లాడుతూ 'స్త్రీ పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, నమ్మకం చాలా ముఖ్యమైన అంశాలు. ఒకరిపట్ల ఒకరికి గౌరవం ఉంటే జీవితాంతం కలిసి ఉండొచ్చు. కోపతాపాలకు దూరంగా అర్థం చేసుకునే సహృదయత కలిగి ఉండాలి. అలాంటి అబ్బాయే కావాలనుకుంటున్నా' అని చెప్పింది. జీవితానికి తప్పకుండా ఓ తోడు అవసరమని, మన కష్టాలను పంచుకునే వారు లేని జీవితాన్ని ఊహించలేమని రష్మిక మందన్న అభిప్రాయపడింది. ప్రస్తుతం ఆమె 'ది గర్ల్‌ఫ్రెండ్' 'రెయిన్‌బో' 'సికందర్' 'ఛావా' 'కుబేర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## రాజీవ్‌గాంధీ హత్య జరిగిన రోజు విశాఖలో ఏం జరిగిందంటే..

వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హొమ్స్'. అనన్య నాగళ్ల, సియా గౌతమ్ కీలక పాత్రధారులు. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. వంశీ నందిపాటి చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ సక్సెస్ మీట్‌ని నిర్వహించారు. ట్రైలర్ మూడు మిలియన్ వ్యూస్‌ని క్రాస్ చేయడం బిగ్ ఎచీవ్‌మెంట్ అని, కథను నమ్మి చేసిన సస్పెన్స్ థ్రిల్లర్ ఇదని, కథనం అద్భుతంగా ఉంటుందని, సినిమా పూర్తవ్వగానే పార్ట్ 2 ఎప్పుడని అడుగుతారని వంశీ నందిపాటి చెప్పారు. 'ఉత్తరాంధ్ర నేపథ్యంతో కూడిన కథ కావడంతో వెన్నెల కిశోర్‌తోపాటు ఆర్టిస్టులంతా ఆ యాసను ప్రాక్టీస్ చేసి నటించారు. రాజీవ్‌గాంధీ హత్య జరిగిన రోజు జరిగే కథ ఇది.ఆయన విశాఖ పర్యటన ముగించుకుని శ్రీపెరంబదూర్ వెళ్లారు. అక్కడ హత్యకు గురయ్యారు. అలాంటి పెద్ద సంఘటన జరిగినప్పుడు చిన్న సంఘటనల్ని ఎవరూ పట్టించుకోరు. ఆ రోజు జరిగిన కొన్ని కల్పిత ఘటనల చుట్టూ అల్లుకున్న కథ ఇది. సినిమా అన్‌ప్రిడిక్టబుల్‌గా ఉంటుంది.'అని దర్శకుడు రైటర్ మోహన్ పేర్కొన్నారు. ఇంకా అనన్య నాగళ్ల, నిర్మాత వెన్నపూస రమణారెడ్డితోపాటు చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.



## ట్రిపుర్‌ఆర్ డాక్యుమెంటరీకి అడ్వాన్స్ ఒపెన్

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా మేకింగ్ వీడియోను డాక్యుమెంటరీ రూపంలో తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఆర్‌ఆర్‌ఆర్– బిహైండ్ అండ్ బియాండ్'అంటూ రాబోతున్న ఈ డాక్యుమెంటరీ డిసెంబర్ 20న నేరుగా ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ స్క్రీన్‌లలో విడుదల కానుంది. అయితే ఇప్పటికే ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా.. మంచి వ్యూస్ దక్కించుకుంది. అయితే రేపు ఈ డాక్యుమెంటరీ విడుదల కానుండగా.. బుక్ మై షోలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. వీటి టికెట్ ధరలు చూసుకుంటే.. రూ.200 నుంచి రూ.300 వరకూ ఉన్నాయి. మరోవైపు ఈ డాక్యుమెంటరీ రన్ టైం 1 గంట 38 నిమిషాలు ఉంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.